

రాంపురం ఎంజేపీ పాఠశాల విద్యార్థుల మధ్య కేక్ కట్ చేస్తున్న మంత్రి సవిత

లోకేశ్‌కు దేశవ్యాప్త కీర్తి

పుట్టిన రోజు వేడుకల్లో టీడీపీ నేతలు

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సేవా కార్యక్రమాలు

(న్యూస్ నెట్‌వర్క్, ఆంధ్రజ్యోతి)

టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్ కష్టపడి ఎదుగుతూ దేశవ్యాప్త కీర్తిని సంపాదించారని టీడీపీ నాయకులు అన్నారు. ఆయన పుట్టిన రోజు వేడుకలను ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. పలు ప్రాంతాల్లో సేవా కార్యక్రమాలను నిర్వహించారు. పెనుకొండలోని టీడీపీ కార్యాలయం, రాంపురం ఎంజేపీ పాఠశాలలో విద్యార్థుల నడుమ బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత కేక్ కట్ చేశారు. విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులను అందించారు. నాణ్యమైన విద్య, ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా మంత్రి లోకేశ్ ముందుకు సాగుతున్నారని అన్నారు. గడిచిన ఐదేళ్లలో విద్యావ్యవస్థ నిర్వీర్యం అయిందని విమర్శించారు. విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే వ్యవస్థను లోకేశ్ గాడిలో పెట్టే పనిలో నిమగ్నమయ్యారని అన్నారు. ఏడు నెలల వ్యవధిలోనే ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాలు..

(మిగతా 6లో..)

సర్పంచ్ దర్జా..!

సొంత పనులకు గ్రామ పంచాయతీ ట్రాక్టర్

సచివాలయానికి తాళం వేసి స్థానికుల నిరసన



సచివాలయానికి తాళం వేసి నిరసన తెలుపుతున్న గ్రామస్థులు

తనకల్లు, జనవరి 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని బొంతలపల్లి పంచాయతీ సర్పంచ్ దర్జా ప్రదర్శించారు. గ్రామ పంచాయతీకి ప్రభుత్వం మంజూరు చేసిన ట్రాక్టర్‌ను రెండేళ్లుగా సొంత అవసరాలకు వాడుకుంటున్నట్లు గ్రామస్థులు ఆరోపించారు. ఆ ట్రాక్టర్‌ను వెంటనే పంచాయతీకి అప్పగించాలంటూ డిమాండ్ చేశారు. ఆ మేరకు గురువారం గ్రామ సచివాలయానికి తాళం వేసి, నిరసన తెలిపారు. గ్రామ పంచాయతీకి ప్రభుత్వం ట్రాక్టర్ మంజూరు చేసింది. దానిని పంచాయతీ అధికారులు.. సచివాలయానికి అందించారు. రోజూ గ్రామంలోని చెత్తను ట్రాక్టర్‌తో సంపద కేంద్రాలకు తరలించాల్సి ఉంది. అధికారులు.. సర్పంచ్‌తో లాలూచీ పడి, ట్రాక్టర్‌ను సచివాలయానికి తీసుకురాకుండా సర్పంచ్ పూల లతకు అప్పగించారన్న ఆరోపణలున్నాయి. సర్పంచ్ రెండేళ్లుగా ట్రాక్టర్‌ను సొంతానికి వినియోగించుకుంటున్నారని గ్రామస్తులు చెబుతున్నారు. దీనిపై గ్రామస్తులు.. పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. దీంతో ఆగ్రహించిన వారు గురువారం మధ్యాహ్నం సచివాలయం వద్దకెళ్లారు. అందులో పనిచేస్తున్న సిబ్బందిని బయటకు పంపి, తాళాలు వేసి, నిరసన తెలిపారు. ట్రాక్టర్ తీసుకువచ్చి పంచాయతీ కార్యాలయం వద్ద ఉంచేవరకు తాళాలు తీసేది లేదని స్పష్టం చేశారు. దీనిపై సచివాలయ సిబ్బంది.. ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. సిబ్బంది వెళ్లిపోయారు. ఈవిషయంపై ఈఓఆర్డీ కృష్ణమూర్తిరెడ్డిని అడగ్గా.. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామన్నారు. వారి ఆదేశాల మేరకు చర్యలు చేపడతామన్నారు. నిరసనలో మాజీ జడ్పీటీసీ రవీంద్రారెడ్డి, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

రేపు బాలికల హాకీ జట్ల ఎంపిక పోటీలు

ధర్మవరం, జనవరి 23(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో జిల్లా సబ్ జూనియర్ బాలికల హాకీ జట్ల ఎంపిక పోటీలు ఈనెల 25వ తేదీన నిర్వహించనున్నట్లు జిల్లా హాకీ సంఘం కార్యదర్శి బంధనాధం సూర్యప్రకాశ్ గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. 25న ఉదయం 9 గంటలకు పోటీలు ఉంటాయన్నారు. ఇందులో ఎంపికైన బాలికల జట్టు ఈనెల 27 నుంచి అనంతపురంలోని ఆర్డీటీ క్రీడామైదానంలో నిర్వహించే రాష్ట్రస్థాయి బాలికల సబ్ జూనియర్ హాకీ పోటీల్లో పాల్గొంటుందన్నారు. 2009 జనవరి ఒకటో తారీఖు తర్వాత జన్మించిన వారు సెలెక్షన్స్‌కు అర్హులన్నారు. హాజరయ్యేవారు ఆధార్ కార్డు, బర్త్ సర్టిఫికెట్ తీసుకురావాలన్నారు.

కందికి మద్దతు ధర రూ.7,550: జేసీ

పుట్టపర్తిటౌన్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): కంది పంటకు మద్దతు ధర క్వింటా రూ.7,550గా ప్రభుత్వం నిర్ణయించిందని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ గురువారం ప్రకటనలో తెలిపారు. త్వరలో రైతులనుంచి కంది కొనుగోళ్లు ప్రారంభిస్తామన్నారు. వెంటనే రైతు సేవాకేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలని అన్నదాతలకు సూచించారు. పంట నమోదు చేసుకున్న రైతుల నుంచి మాత్రమే కంది కొనుగోలు చేస్తామన్నారు. తేమశాతం 12లోపు ఉండేలా రైతులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

ముగ్గురికి అవార్డులు



అవార్డుకు ఎంపికైన ప్రమోద్ కుమార్

పుట్టపర్తి, జనవరి 23(ఆంధ్రజ్యోతి): ఓటర్ల జాబితా ఎన్‌రోల్‌మెంట్‌లో మెరుగైన పనితీరు కనబరచిన జిల్లాలోని ముగ్గురికి ఎన్నికల సంఘం అవార్డులు ప్రకటించింది. రాష్ట్ర స్థాయి ఉత్తమ ఎలక్టోరల్ ప్రాక్టీసెస్ అవార్డుకు ఎంపిక చేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ధర్మవరం నియోజకవర్గ ఏఈఆర్‌ఓగా వ్యవహరించిన మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్, హిందూపురం, పుట్టపర్తి నియోజకవర్గాల్లో బీఎల్‌ఓలుగా పనిచేసిన గుణశేఖర్, రమాదేవిని అవార్డులు వరించాయి. ఈనెల 25న జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా విజయవాడలో నిర్వహించే వేడుకల్లో వీరికి అవార్డులు ప్రదానం చేయనున్నారు.

పెండింగ్ పనులు సత్వరమే పూర్తి చేయాలి

- కలెక్టర్ టీఎస్ చేతన్

పుట్టపర్తిటౌన్, జనవరి23(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పెండింగ్‌లో ఉన్న పనులను సత్వరమే పూర్తి చేయాలని కలెక్టర్ టీఎస్ చేతన్.. సంబంధిత అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని సమావేశం భవనంలో జాతీయ రహదారులు, రైల్వే, హౌసింగ్, రోడ్లు భవనాలు, అటవీశాఖ, నీటిపారుదల, భూసేకరణ శాఖలపై గురువారం ఆయన సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. భూ సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. బుక్కపట్నం మండలం సిద్దరాంపురం గ్రామం వద్ద పెండింగ్‌లో ఉన్న రోడ్డు పనులను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

అరుణవర్ణ శోభితం



సంధ్యాసమయంలో ఆకాశం అరుణ వర్ణశోభితమై ఆహ్లాదాన్ని పంచింది. సూర్యుడు తెరచాటుకు చేరుకోగా.. ఆకాశం పడమర వైపు ఎరుపెక్కింది. హిందూపురంలో గురువారం సాయంత్రం ఆకాశంలో ప్రకృతి పెయింటింగ్‌ను చూసి జనం మురిసిపోయారు.

- హిందూపురం, ఆంధ్రజ్యోతి

ఉష్ణోగ్రతలు

గరిష్ఠం	31.0
కనిష్ఠం	17.0

సాటి మనిషి..

అపోహలు వీడి.. ఆస్పత్రిలో చేర్చండి..

ప్రాణం నిలపండి..

రోడ్డు ప్రమాదాల్లో మొదటి గంట కీలకం

బాధితులకు సాయం అందిస్తే నగదు పురస్కారాలు

హిందూపురం, జనవరి 23(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాలు ఇటీవలి కాలంలో విపరీతంగా పెరిగాయి. రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారిని ఆస్పత్రికి తీసుకెళ్లే సమయంలో మృతిచెందుతున్నారు. వైద్యులు పరిశీలించి 5 నిమిషాలు ముందు తీసుకొచ్చి ఉండుంటే బాధితుడు బతికి ఉండేవాడని చెబుతున్న మాటలు సామాజిక మాధ్యమాల్లో రోజూ వింటున్నాం. రోడ్డు ప్రమాదాలు జరిగితే ఆ దృశ్యాలను సెల్‌ఫోన్‌లో బంధించడానికి పోటీపడుతున్నారు తప్ప.. గాయపడిన వారిని ఆస్పత్రికి తరలించేందుకు, సాయం చేయడానికి వెనుకడుగు వేస్తున్నారు. దీనిని నివారించేందుకు కేంద్ర ప్రభుత్వం గుడ్ సమరిటన్ చట్టాన్ని ప్రవేశ పెట్టింది. ఇది అమలులోకి వచ్చి మూడేళ్లవుతున్నా నేటికీ ప్రజలకు అవగాహన లేకపోవడం దురదృష్టకరం.

గోల్డెన్ అవర్ కీలకం

ఉమ్మడి జిల్లాలో వాహన ప్రమాదాల్లో రహదారులపై కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్న వారి సంఖ్య రోజురోజుకీ పెరుగుతోంది. కొన్ని సందర్భాల్లో ప్రమాదం జరిగినపుడు కొన ఊపిరితో రోడ్డుపై పడి కొట్టుమిట్టాడుతున్నా వందలాది మంది చూస్తూ మిన్నకుంటున్నారు. సకాలంలో వారిని ఆస్పత్రిలో చేర్పించి, మానవత్వం చాటుకోవడంతో పాటు విలువైన ప్రాణాలు కాపాడలేకపోతున్నారు. ఇందుకు ఒక అపోహ కూడా ఉంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వారికి సాయం అందిస్తే ఎక్కడ తమపై కేసులు నమోదు చేస్తారోనని చాలామంది వెనకడుగు వేస్తున్నారు. దీంతో కేంద్ర ప్రభుత్వం ఇలాంటి ప్రమాదాల్లో గాయపడినవారిని సకాలంలో ఆస్పత్రిలో చేర్పిస్తే నగదు పురస్కారాన్ని ప్రకటించింది. తద్వారా అపోహలు కూడా పోతాయని భావిస్తోంది. సకాలంలో వైద్యం అందక రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారు 50 శాతం మంది మృతిచెందుతున్నట్లు తెలుస్తోంది. దీంతో గాయపడిన వారిని గోల్డెన్ అవర్ (ప్రమాదం జరిగిన గంటలోపు)లో ఆస్పత్రికి తరలిస్తే ప్రాణాలు నిలిపే అవకాశం ఉంటుంది. వారిని ఆస్పత్రిలో చేరిస్తే ఎక్కడ పోలీసు స్టేషన్ చుట్టూ తిరగాల్సి వస్తుందోనన్న భయంతో చాలామంది పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఈ తరుణంలో గుడ్ సమరిటన్ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం మూడేళ్ల క్రితమే ప్రారంభించింది. దీనిపై ప్రచారం లేకపోవడంతో ప్రజల్లో అవగాహన కొరవడిందని చెప్పవచ్చు. దీనిపై అవగాహన కల్పించడంలో పోలీసులు, రవాణాశాఖలు కూడా విఫలమయ్యాయన్న వాదనలు వినిపిస్తున్నాయి.

చట్టం అమలు ఇలా..

గుడ్ సమరిటన్ చట్టం ప్రకారం జాతీయ, రాష్ట్రీయ రహదారులపై ప్రమాదాల్లో క్షతగాత్రులను ఆస్పత్రికి తరలిస్తే రూ.5వేలు అందుతుంది. ఇది పొందాలంటే బాధితుడిని గంటలోపు ఆస్పత్రికి తరలించి, పోలీసులకు సమాచారం ఇవ్వాలి. వారు ప్రాణదాత అంటూ ప్రమాద వివరాలతో కూడిన లేఖ ఇస్తారు. ఇది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. అక్కడి నుంచి సొమ్ము ప్రాణదాతల ఖాతాలో జమవుతుంది. ప్రశంసాపత్రం కూడా పొందవచ్చు. ఒక వ్యక్తి గరిష్ఠంగా ఏడాదిలో ఐదుసార్లు అవార్డు పొందే అవకాశం ఉంది. కాపాడిన వారు వ్యక్తిగత వివరాలు చెప్పాల్సిన అవసరం లేదు. డబ్బు ఖర్చు చేయాల్సిన పనిలేదు. ఆస్పత్రిలో చేర్పించి, వెళ్లిపోవచ్చు. ఇతరుల నుంచి బెదిరింపులు రాకుండా ఒక కమిటీ రక్షణ కూడా కల్పిస్తుంది. ఏడాదిలో ఎక్కువ మందిని కాపాడిన పదిమందిని ఎంపిక చేసి, ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున నగదు బహుమతి అందజేస్తారు.



అపోహలు వీడండి



రోడ్డు ప్రమాదాలు జరిగినపుడు స్థానికులు వెంటనే స్పందించి, సకాలంలో గంటలోపు ఆస్పత్రికి చేర్పిస్తే వారికి గుడ్ సమరిటన్ పథకం కింద నగదు పురస్కారంతోపాటు ప్రశంసాపత్రం అందజేస్తారు. ప్రజలు అపోహలు వీడి, గాయపడిన వారిని వెంటనే ఆస్పత్రిలో చేర్పించాలి. తద్వారా విలువైన ప్రాణాలను కాపాడినవారవుతారు. పోలీసుల నుంచి ఇబ్బందులు ఉండవు. దీనిపై ప్రజలు అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉంది.

-ఆంజనేయులు, సీఐ, హిందూపురం అప్‌గ్రేడ్ పోలీసు స్టేషన్

జిల్లాలో రహదారులు ఇవీ..

జిల్లాలో 44వ, 544ఈ, కదిరి-హిందూపురం, సోమందేపల్లి-గౌరీబిదునూరు, ముదిగుబ్బ-కదిరి రహదారులు ఉన్నాయి. ప్రస్తుతం మరో రెండు జాతీయ రహదారులు ఏర్పాటవుతున్నాయి. ఈ రహదారుల్లో నిత్యం ఏదో ఒకచోట ప్రమాదాలు జరిగి, విలువైన ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి. క్షతగాత్రులను ఆస్పత్రిలో చేర్పించడానికి 108 వాహనాలు అందుబాటులో ఉంటున్నాయి. అయినా కొన్ని సందర్భాల్లో ప్రమాద స్థలానికి సకాలంలో చేరుకోక ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి. కొన్నిసార్లు ఇతర వాహనాల్లో ఆస్పత్రికి తరలించే అవకాశం ఉన్నా.. ఆ మేరకు స్థానికులకు అవగాహన లేక కళ్లముందే బంధువులు, స్నేహితులు కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతున్నా.. నిస్సహాయ స్థితిలో ఉండిపోతున్నారు.

లోకేశ్‌కు దేశవ్యాప్త కీర్తి

(5వ పేజీ తరువాయి)

కల్పించారని అన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా పార్టీ నాయకులు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసులు, మాజీ జెడ్పీటీసీ నారాయణస్వామి, యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ కేశవయ్య, కన్వీనర్‌లు సిద్దయ్య, శ్రీరాములు, బాబుల్‌రెడ్డి, త్రివేంద్ర, దాదు, రామక్రిష్ణ, లక్ష్మీనారాయణ రెడ్డి, అడదాకులపల్లి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న కాలవ శ్రీనివాసులు

● డి.హీరేహాళ్‌లో ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు ఆధ్వర్యంలో లోకేశ్ పుట్టిన రోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. విదేశాలలో ఉన్నత విద్యను అభ్యసించి, తన భవిష్యత్తును వదులుకుని, తాత ఎన్టీఆర్ ఆశయాల సాధనకు లోకేశ్ కృషి చేస్తున్నారని కాలవ అన్నారు. వైసీపీ ప్రభుత్వంలో ఎన్నో అవమానాలను ఎదుర్కొని, వాటినే విజయానికి మెట్లుగా మార్చుకున్నారని, దేశ వ్యాప్తంగా కీర్తి ప్రతిష్ఠలను సొంతం చేసుకున్నారని అన్నారు. చిన్న వయసులోనే రాష్ట్ర అభివృద్ధి బాధ్యతలను మోస్తూ, తండ్రికి తగ్గ తనయుడిగా పేరు సంపాదించారని అన్నారు. ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ నాగల్లి రాజు, మండల కన్వీనర్ హనుమంతరెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జ్ మోహన్‌రెడ్డి, ఎంపీటీసీ గంగాధర తదితరులు పాల్గొన్నారు.



రక్తదానం చేసిన యువకుడికి సర్టిఫికెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్

2500 మంది రక్తదానం

లోకేశ్ పుట్టినరోజు సందర్భంగా కళ్యాణదుర్గంలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఆధ్వర్యంలో 2500 మందికి పైగా ప్రజలు, నాయకులు, కార్యకర్తలు రక్తదానం చేశారు. అనంతరం బర్త్‌డే కేక్‌ను ఎమ్మెల్యే కట్ చేశారు. రక్తదానం చేసినవారికి రూ.లక్ష ప్రమాద బీమా వర్తింపజేస్తూ, బ్లడ్ డొనేషన్ సర్టిఫికెట్‌ను టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్‌తో కలిసి పంపిణీ చేశారు. అనంతరం 10 వేల మంది పేద మహిళలకు చీరలను పంపిణీ చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం పరితపిస్తూ, అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతున్న నారా లోకేశ్‌ను స్ఫూర్తిగా తీసుకుని పార్టీ శ్రేణులు ముందుకు సాగాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. రక్తదాన కార్యక్రమాన్ని విజయవంతం చేసిన రెడ్‌క్రాస్ సొసైటీ, ఆర్టీటీ సిబ్బంది, ప్రభుత్వ వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు, ఉద్యోగులు, కూటమి నాయకులు, కార్యకర్తలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

● టీడీపీ అనంతపురం జిల్లా కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి, మాజీ మేయర్ స్వరూప, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గౌస్ మొద్దీన్, రాష్ట్ర నాయకులు తలారి ఆదినారాయణ, గాజుల ఆదెన్న, ముంటిమడుగు కేశవరెడ్డి, గంజే నాగరాజు తదితరులు కేక్ కట్ చేశారు. నాయకులు సరిపూటి రమణ, గంగారామ్, కూచి హరి, స్వామిదాస్, నారాయణస్వామి యాదవ్, కుంచెపు వెంకటేష్, పోతుల లక్ష్మీనరసింహులు, కురబ నారాయణస్వామి, నెట్టెం బాలకృష్ణ, లక్ష్మీనరసింహ, పీఎం లక్ష్మీప్రసాద్, స్వప్న, సంగా తేజస్విని, కంతాదేవి తదితరులు పాల్గొన్నారు.

● మంత్రి నారా లోకేశ్ బంగారు భవిష్యత్తు ఉన్న నాయకుడని గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం అన్నారు. నారా లోకేశ్ అభిమాన సంఘం జాతీయ అధ్యక్షుడు ఆనంద్ రెడ్డి ఆధ్వర్యంలో గుంతకల్లు కేజీబీవీ పాఠశాలలో వేడుకలను నిర్వహించారు.



వెంకటాపురంలో కేక్‌కట్ చేస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

● రాష్ట్ర భవిష్యత్తుకోసం పరితపిస్తున్న నాయకుడు లోకేశ్ అని ఎమ్మెల్యే పరిటాల సునీత, టీడీపీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ అన్నారు. వెంకటాపురంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల మధ్య కేక్‌కట్ చేసి, లోకేశ్ పుట్టిన రోజు వేడుకలను నిర్వహించారు. ఎన్టీఆర్ మనవడు, చంద్రబాబు కుమారుడిగా కాకుండా, తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారని అన్నారు.



కేక్ కట్‌చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీ

● మడకశిర ఒకేషనల్ కళాశాల ఆవరణలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామితో కలిసి ఎమ్మెల్యే ఎంఎస్ రాజు కేక్‌కట్ చేశారు. రాష్ట్రాన్ని లోకేశ్ ప్రగతి పథంలో నడిపిస్తున్నారని అన్నారు. యువతలో సాంకేతిక నైపుణ్యాలను పెంచి, స్వతహాగా ఎదిగేందుకు కృషి చేస్తున్నారని అన్నారు. వేడుకలలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు

ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ సురేష్

అనంతపురం న్యూటౌన్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉన్న నీటి వనరులను వినియోగించుకొని తాగునీటి సమస్య తలెత్తకుండా తగిన చర్యలు చేపడుతున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ సురేష్ అన్నారు. గురువారం కార్యాలయంలోని తన చాంబర్‌లో శాఖపరంగా చేపడుతున్న పలు పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఏబీఆర్, మిడ్‌పెన్నార్, గండికోట జలాశయాల నుంచి ఆయా ప్రాంతాల్లో ఉన్న గ్రామాల్లో ఎలాంటి నీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టడం జరుగుతోందన్నారు. అందుకు అనుగుణంగా దాదాపు రూ.50 కోట్లతో డీపీఆర్ తయారు చేయడం జరిగింది. మరో రెండు రోజుల్లో ఇందుకు సంబంధించి అనుమతులు వచ్చే అవకాశం ఉందన్నారు.

మత్తు బడి

- విచ్చలవిడిగా పొగాకు ఉత్పత్తుల వినియోగం
- పాఠశాల ఆవరణలో గుంపులుగా.. గుప్పు గుప్పు
- మద్యం సేవించి బడికి వస్తున్న కొందరు బాలలు
- దండిస్తే.. గురువులపై తిరగబడుతున్నారు
- తల్లిదండ్రులు మేల్కోకపోతే భవిష్యత్తు బుగ్గి

అనంతపురం విద్య, జనవరి 23(ఆంధ్రజ్యోతి): బంగారు బాల్యం మత్తులో పడుతోంది. విద్యార్థి దశలోనే విషతుల్యం అవుతోంది. పొట్ట కూటి కోసం తిప్పలు పడే తల్లిదండ్రులు.. తమ బిడ్డల బతుకులైనా బాగుపడాలని బడికి పంపితే.. అక్కడ మత్తు రక్కసి కబలిస్తోంది. కొన్ని పాఠశాలల ఆవరణలోనే బీడీ, సిగరెట్, గుట్కా వినియోగం జరుగుతోంది. మరికొందరు మద్యం కూడా తాగుతున్నారు. ఉపాధ్యాయులు దండిస్తే ఎదురు తిరుగుతున్నారంటే.. పరిస్థితి ఎంతగా దిగజారిందో అర్థం చేసుకోవచ్చు. పాఠశాలలు, కాలేజీలకు 300 అడుగుల పరిధిలో మత్తు పదార్థాల అమ్మకం నిషిద్ధం. కానీ కొందరు దొంగచాటుగా, మరికొందరు బహిరంగంగా విక్రయిస్తున్నారు. 2024-25 యూడైస్ ప్రకారం జిల్లావ్యాప్తంగా 2,417 పాఠశాలలు ఉన్నాయి. వీటి పరిధిలో 3,99,293 మంది విద్యార్థులు, 14,881 మంది ఉపాధ్యాయులు ఉన్నారు. పాఠశాల విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు ఉమ్మడి జిల్లా పర్యటనకు శుక్రవారం వస్తున్నారు. ఈ నేపథ్యంలో విద్యాసంస్థలలో అసాంఘిక కార్యకలాపాలపై కథనం.

బడి సంచిలో..


బడికి వెళ్లే విద్యార్థులు సంచిలో పుస్తకాలతో పాటు చిరుతిండ్లను తీసుకువెళ్లడం పరిపాటి. కానీ కొందరు చైనీ ఖైనీ, రాజా, హన్స్, గట్కా వంటి మత్తు పదార్థాలను తెచ్చుకుంటున్నారు. పొగాకు పదార్థాలను తరగతి గదుల్లోనే వినియోగిస్తున్నారు. మరికొందరు మద్యం సేవించి బడికి వస్తున్నారు. మధ్యాహ్న భోజనం, విశ్రాంతి సమయాలలో పాఠశాల ఆవరణలో వైటనర్ వంటివి బట్టలో పెట్టుకుని పీలుస్తున్నారు. ఇవి ఎంత ప్రాణాంతకమో తెలియక.. మత్తుకు బానిసలు అవుతున్నారు. కొన్ని పాఠశాలల వద్ద గుంపులుగా చేరి సిగరెట్లు తాగుతున్నారు. ఇలాంటి దృశ్యాలు జిల్లాలోని చాలా ప్రభుత్వ పాఠశాలల్లో సర్వసాధారణంగా మారాయి. కొన్ని ప్రైవేట్ స్కూళ్లలో సైతం విద్యార్థులు మద్యం తాగుతున్నారు. టీచర్లు దండిస్తే ఎదురుతిరుగుతున్నారు. తల్లిదండ్రులు జీవనపోరాటంలో తీరకలేకుండా ఉండి.. పిల్లలపై నిఘా వేయకపోవడంతో ఈ పరిస్థితి తలెత్తుతోంది.

ఇక్కడ విచ్చలవిడి..

అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని చాలా పాఠశాలల్లో విద్యార్థులు మత్తులో పడ్డారు. అంబేడ్కర్ నగర్, టీవీ టవర్, బుడ్డప్పనగర్, నవోదయ కాలనీ ప్రాంతాల విద్యార్థులలో కొందరు దురలవాట్లకు బానిసలయ్యారు. అనంతపురం రూరల్ ప్రాంతంలోని కొన్ని కాలనీల విద్యార్థులు, కూడేరు, నార్పల, శింగనమల, జిల్లా సరిహద్దు మండలాల్లోని కొందరు విద్యార్థులు తరచూ 'మత్తు'గా బడికి వస్తున్నారని ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దండిస్తే తమకు, ప్రధానోపాధ్యాయులకు సైతం ఎదురు తిరుగుతున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతో కొందరు టీచర్లు, పీడీలు ఒకసారి మందలించి వదిలేస్తున్నారు. తల్లిదండ్రులకు ఫిర్యాదు చేసినా పిల్లలల్లో మార్పు కనిపించడం లేదని అంటున్నారు.



అనంతపురంలోని ఓ పాఠశాలకు మద్యం సేవించి వచ్చి తరగతి గదిలో పడిపోయిన విద్యార్థి (ఫైల్)



ఖైనీ వినియోగం కారణంగా విద్యార్థి నోటిలో ఏర్పడిన పుండ్లు

ప్రమాదకరం

బాల్యంలో పొగాకు, గుట్కా, మద్యం వినియోగం అత్యంత ప్రమాదకరమని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. మత్తు పదార్థాలు వాడేవారికి నోటి, గొంతు జబ్బులు వస్తున్నాయని అంటున్నారు. పొగాకు వినియోగంవల్ల అనేక రకాల క్యాన్సర్లు వచ్చే ప్రమాదం ఉంది. పక్షవాతం, అంధత్వం, చిగురు వాపు, ఆయాసం, రక్తనాళాలు గడ్డలు కట్టడం, ఎముకలు బలహీనపడటం, భవిష్యత్తులో సంతానోత్పత్తి శక్తి తగ్గడం వంటి దీర్ఘకాలిక సమస్యలు తలెత్తుతాయి. నోరు, ఊపిరితిత్తులు, తల, జీర్ణాశయం, మూత్రనాళాలపై పొగాకు ఉత్పత్తులు దుష్ప్రభావం చూపుతాయి.



అవగాహన కల్పిస్తున్నాం..

మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నాం. ఉపాధ్యాయులు, హెచ్‌ఎంలకు సూచనలు ఇచ్చాం. ఇటీవల పాఠశాలల్లో యాంటి డ్రగ్ యాక్టివిటీస్ నిర్వహించాం. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్లలో 1,030 ప్రహరీ క్లబ్స్ ఏర్పాటు చేశాం. వాటి ఆధ్వర్యంలో యాంటి డ్రగ్స్ కార్యక్రమాలు నిర్వహిస్తూ, ఉపాధ్యాయులు, విద్యార్థుల్లో చైతన్యం తెస్తున్నాం. ఎక్కడైనా మత్తు పదార్థాల వినియోగం జరుగుతుంటే.. పోలీసుల సహకారంతో అరికట్టడానికి చర్యలు తీసుకుంటాం.

-ప్రసాద్‌బాబు, డీఈఓ

నేడు విద్యాశాఖ కమిషనర్ రాక

జేఎన్టీయూలో ఉమ్మడి జిల్లా అధికారులతో సమావేశం

అనంతపురం విద్య, జనవరి 23(ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు శుక్రవారం అనంతపురం జిల్లాకు రానున్నారు. జేఎన్టీయూ ఆడిటోరియంలో ఉమ్మడి అనంతపురం జిల్లాలోని డీఈఓ లు, డిప్యూటీఈఓలు, ఎంఈఓలు -1, 2లతో సమావేశం నిర్వహించనున్నారు. ముఖ్యంగా స్కూల్ కాంప్లెక్స్‌ల పునర్నిర్మాణం, జీఓ 117 రద్దు, ప్రత్యామ్నా య ఏర్పాట్లు, ఇతర చర్యలు తదితర అంశాలపై సమావేశంలో కమిషనర్ దిశానిర్దేశం చేయనున్నారు.

జిల్లాకు ఆర్‌జేడీ శామ్యూల్

పాఠశాల విద్యాశాఖ కడప ఆర్‌జేడీ శామ్యూల్ గురువారం మధ్యాహ్నం అనంతపురం జిల్లాకు చేరుకున్నారు. కమిషనర్ పర్యటన నేపథ్యంలో ఆయన జిల్లాకు వచ్చారు. ఉద్యోగోన్నతి పొంది రెగ్యులర్ ఆర్‌జేడీ అయ్యాక శామ్యూల్ తొలిసారి జిల్లాకు రావడంతో పలు సంఘాల నేతలు ఆయనను కలసి శుభాకాంక్షలు తెలిపారు. డీఈఓ కార్యాలయంలో ఉన్న ఆయనను అనంతపురం జిల్లా ప్రైవేట్ అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్ నాయకులు, ఏపీటీఎఫ్, ఎస్టీయూ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. విద్యా, ఉపాధ్యాయ సమస్యలను ఆర్‌జేడీ దృష్టికి తీసుకెళ్లారు.

వందేళ్లయినా రవి పేరు ప్రతిధ్వనిస్తుంటుంది

రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత

రామగిరి, జనవరి 23(ఆంధ్రజ్యోతి): వందేళ్లయినా పరిటాల రవి పేరు ప్రతిధ్వనిస్తూనే ఉంటుందని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాలసునీత, పరిటాలశ్రీరామ్ అన్నారు. గురువారం పరిటాల రవీంద్ర వర్ధంతికి సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ శుక్రవారం వెంకటాపురంలో జరగనున్న పరిటాల రవీంద్ర 20వ వర్ధంతికి పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. సంక్రాంతి పండుగను పరిటాల రవి ఎంతో బాగా జరిపే వారని, పిల్లలతో సరదాగా ఉండేవారన్నారు. పండుగ అయిన వారం రోజుల తరువాత హత్యకు గురికావడాన్ని ఇప్పటికీ మరిచిపోలేకపోతున్నామన్నారు. ఆయన తమపై పెద్ద బాధ్యతలు పెట్టారని వాటిని నెరవేర్చేదిశగా చివరికి వరకు ప్రయత్నిస్తున్నామన్నారు. ఎన్టీఆర్, పరిటాల రవి లాంటి వారు బతికినన్ని రోజులు ప్రజల సంక్షేమానికి పాటుపడ్డారని, అలాంటి వారిని వందేళ్లయినా మరువరన్నారు. వర్ధంతికి వచ్చే ప్రతి ఒక్కరు జాగ్రత్తగా రావాలని సూచించారు. కాగా ఉమ్మడి అనంతపురం జిల్లాతోపాటు తెలంగాణా, ఏపీ, కర్ణాటక రాష్ట్రాల నుంచి అభిమానులు తరలిరానున్న నేపథ్యంలో అందుకు తగిన విధంగా ఏర్పాట్లు చేశారు. ఎంతమంది వచ్చినా అందరికి బోజనం అందించేలా చర్యలు తీసుకున్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రముఖులు వస్తున్న నేపథ్యంలో పార్కింగ్ విషయంలో జాగ్రత్తలు తీసుకుంటున్నారు. మరోవైపు పరిటాలఘాట్‌ను వివిధ రకాల పుష్పాలతో అందంగా అలంకరిస్తున్నారు. నిమ్మలకుంట కళాకారులతో తోలుబొమ్మల ప్రదర్శన కూడా ఏర్పాటుచేశారు. పరిటాల రవీంద్ర కోడళ్లు పరిటాలజ్ఞాన, పరిటాల తేజస్వి పొయ్యిల వద్ద పూజలు చేసి వంటకాల తయారీని ప్రారంభించారు.



ఘాట్‌కు అలంకరించే పూలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్

కందుల కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి

రైతులకు జేసీ శివనారాయణ శర్మ సూచన

ఉరవకొండ, జనవరి 23(ఆంధ్రజ్యోతి): కందుల కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మ సూచించారు. పట్టణంలోని మార్కెట్ యార్డు ఆవరణలో గురువారం మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కందుల కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా కొనుగోలు చేస్తామని జేసీ వివరించారు. వ్యవసాయశాఖ జేడీ ఉమామహేశ్వరమ్మ, మార్క్‌ఫెడ్ డీఎం పెన్నేశ్వరి మాట్లాడుతూ అన్ని మండలాల్లో త్వరలోనే కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తామన్నారు. ఈ క్రాప్ నమోదు చేసిన రైతులందరూ కొనుగోళ్ల కోసం రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మార్కెటింగ్ ఏడీ సత్యనారాయణ చౌదరి, తహసీల్దార్ మహబూబ్‌బాషా, ఏడీఏ పద్మజ, ఏవో శుభకర్, వీపీసీఈవో గౌస్, ఏఎంసీ సెక్రటరీ నారాయణ స్వామి పాల్గొన్నారు. కాగా మంత్రి కేశవ్ చొరవతోనే కొనుగోలు ప్రారంభించడం జరిగిందని ఏపీ ఐడీసీ మాజీ డైరెక్టర్ దేవినేని పురుషోత్తం, ఏఎంసీ మాజీ చైర్మన్ రేగాటి నాగరాజు అన్నారు.



కొనుగోలు ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న జేసీ, టీడీపీ నాయకులు

నేటి నుంచి కందుల కొనుగోలు ప్రారంభం

● ఏపీ మార్క్‌ఫెడ్ డీఎం పెన్నేశ్వరి

అనంతపురం అర్బన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 31 కేంద్రాల్లో శుక్రవారం నుంచి కందులు కొనుగోలు ప్రారంభిస్తున్నట్లు ఏపీ మార్క్‌ఫెడ్ డీఎం పెన్నేశ్వరి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లావ్యాప్తంగా ఇప్పటి దాకా 2 వేల మంది రైతులు తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేసుకున్నారన్నారు. క్వింటా కంది కనీస మద్దతు ధర రూ.7550లుగా ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. 12 శాతంలోపే తేమ ఉంటేనే కందులు కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. కొనుగోల కేంద్రాల నిర్వాహకుల నుంచి రైతులకు ముందస్తుగా ఏయే తేదీల్లో సరుకు తీసుకురావాలన్న సమాచారం ఇస్తారని, ఆ సమాచారం మేరకు నిర్ణయించిన తేదీల్లో రైతులు సరుకు కొనుగోలు కేంద్రాల వద్దకు తీసుకురావాలని సూచించారు. ముందస్తు సమాచారం లేకుండా ఎవ్వరూ సరుకును తీసుకురాకూడదన్నారు. ఇప్పటికీ మిగతా రైతులు కూడా రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చునన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు కంట్రోల్ సెల్‌లోని 8500292992, 8978381841 సెల్ నెంబర్లను సంప్రదించాలని కోరారు.

మొక్కల సంరక్షణకు చర్యలు

అనంతపురం న్యూటౌన్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): నాటిన మొక్కలను సంరక్షించేందుకు చర్యలు చేపట్టేలా చూడాలని స్క్వాడ్ డీఎఫ్‌ఓ గురుప్రభాకర్ ఆదేశించారు. గురువారం స్క్వాడ్ రేంజర్ చంద్రశేఖర్‌తో కలిసి అనంతపురం రేంజర్ పరిధిలోని శింగవరం, మరుట్ల సౌత్, మరుట్ల నార్త్ బీట్లలో నాటిని మొక్కలను పరిశీలించారు. ప్రస్తుతం నాటిన మొక్కలకు ఎలాంటి సమస్యా లేనప్పటికి వేసవిలో సమస్య ఉత్పన్నమయ్యే అవకాశం ఉందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని ముందస్తుగా చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో సెక్షన్ ఆఫీసర్ అక్బర్, బీట్ ఆఫీసర్లు ప్రతాప్, రవిచంద్రారెడ్డి, నారాయణ, నీలవేణి తదితరులు పాల్గొన్నారు.

బి-ఫార్మసీ ఫలితాలు విడుదల

అనంతపురం సెంట్రల్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): జేఎన్టీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన బి-ఫార్మసీ పరీక్షల ఫలితాలను విడుదల చేశామని డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్ ప్రొఫెసర్ నాగప్రసాద్ నాయుడు గురువారం తెలిపారు. డిసెంబరులో తృతీయ సంవత్సరం ప్రథమ సెమిస్టర్(ఆర్19) రెగ్యులర్, సప్లిమెంటరీ పరీక్షలు, తృతీయ, ద్వితీయ సెమిస్టర్ల (ఆర్19, 15), తృతీయ సంవత్సరం ప్రథమ సెమిస్టర్(ఆర్15) సప్లిమెంటరీ పరీక్షలు జరిగాయని తెలిపారు. వీటి ఫలితాల కోసం www.jntuaresults.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు. కార్యక్రమంలో ఈసీ ప్రొఫెసర్ శివకుమార్, ఏసీఈలు ప్రొఫెసర్ శేఖర్‌రాజు, డాక్టర్ అంకారావు, డాక్టర్ శ్రీధర్ పాల్గొన్నారు.

బీటెక్ ఫలితాలు...

అనంతపురం సెంట్రల్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల బీటెక్ పరీక్షల ఫలితాలను గురువారం ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చెన్నారెడ్డి తన చాంబర్‌లో విడుదల చేశారు. విద్యార్థులు ఫలితాల వివరాలకోసం అకడమిక్ సెక్షన్‌ను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వసుంధర, డీసీఈ లలితకుమారి, మాధవి పాల్గొన్నారు.

2047 నాటికి రొబోటిక్ అగ్రికల్చర్ విధానం

ఎస్కేయూ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ అనిత

అనంతపురం సెంట్రల్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (కృత్రిమ మేధ)ను వ్యవసాయ రంగానికి అనుసంధానిస్తే 2047కి రోబోటిక్ అగ్రికల్చర్ విధానం వస్తుందని ఎస్కేయూ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ అనిత అన్నారు. గురువారం ఎస్కేయూలోని సామాజిక సమ్మిళిత అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో 'గ్రామీణాభివృద్ధికి వ్యవసాయ రంగం-అనుబంధ రంగాల వ్యూహాలు' అంశంపై గురువారం వర్క్‌షాప్ నిర్వహించారు. డైరెక్టర్ ప్రొఫెసర్ మునినారాయణప్ప అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి వీసీ అనిత, రెక్టార్ వెంకటనాయుడు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ.. వ్యవసాయరంగంలో వస్తున్న మార్పులపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. అదేవిధంగా ఉత్పత్తి, మార్కెట్ సౌకర్యాలను రైతులు ఎప్పటికప్పుడు తెలుసుకుంటుండాలన్నారు. అనంతరం కేంద్ర, రాష్ట్రాలు అమలు చేస్తున్న పథకాలపై పశుసంవర్ధకశాఖ శాస్త్రవేత్త కృష్ణమూర్తి, అగ్రికల్చర్ ఏడీ యల్లప్ప రైతులకు వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కృష్ణకుమారి, డైరెక్టర్ జీవీ రమణ, సామాజిక సమ్మిళిత అధ్యన కేంద్రం అసిస్టెంట్ డైరెక్టర్లు వెంకటరెడ్డి, శ్రీనివాసరావు, రీసర్చ్ అసిసెంట్లు కొండారెడ్డి, పద్మావతి, ప్రొఫెషనల్ అసిస్టెంట్ క్రిష్ణారెడ్డి, సిబ్బంది ప్రశాంత్‌రెడ్డి, నర్మద, వరలక్ష్మి పాల్గొన్నారు.

ఉచిత శిక్షణ

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): రూడ్‌సెట్‌లో శనివారం నుంచి కంప్యూటర్ ట్యాలీ ఉచిత శిక్షణను ప్రారంభించనున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ విజయలక్ష్మి గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాలో 18-45 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన చదవడం, రాయడం వచ్చి ఆధార్‌కార్డు, రేషన్ కార్డు కలిగిన మహిళలు అర్హులన్నారు. 30రోజులపాటు నిర్వహించే శిక్షణ కాలంలో ఉచిత వసతి, భోజన సదుపాయం ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు సెల్ నంబరు 9492583484ను సంప్రదించాలన్నారు.

రేపు బాస్కెట్‌బాల్ ఎంపిక పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): బాస్కెట్‌బాల్ అండర్-23 జిల్లా జట్ల ఎంపిక పోటీలు శనివారం సాయంత్రం 5గంటలకు అశోక్‌నగర్‌లోని డీఎస్‌ఏ ఇండోర్‌స్టేడియంలో నిర్వహించనున్నట్లు ఆ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీకాంత్‌రెడ్డి, నరేంద్రచౌదరి తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 28వతేదీ నుంచి 31వతేదీ వరకు విజయవాడలో నిర్వహించే రాష్ట్రస్థాయి అండర్-23 బాస్కెట్‌బాల్ పోటీలకు ప్రాతినిథ్యం వహిస్తారన్నారు. మరిన్ని వివరాలకు సెల్ నంబరు 9393711324ను సంప్రదించాలని కోరారు.

రాజధాని ఎక్స్‌ప్రెస్‌కు యాద్గిర్ స్టేషన్‌లో హాల్ట్

గుంతకల్లు, జనవరి 23(ఆంధ్రజ్యోతి): హజ్రత్ నిజాముద్దీన్ (న్యూఢిల్లీ) నుంచి బెంగళూరు మధ్యన తిరిగే రాజధాని ఎక్స్‌ప్రెస్ (22691/92)కు యాద్గిర్ స్టేషన్‌లో హాల్ట్‌ను ఏర్పాటు చేసినట్లు రైల్వే అధికారులు గురువారం ప్రకటనలో తెలిపారు. హజ్రత్ నిజాముద్దీన్-బెంగళూరు ఎక్స్‌ప్రెస్‌కు ఈనెల 28 నుంచి, తిరుగు ప్రయాణపు రైలుకు 29వ తేదీ నుంచి యాద్గిర్ స్టేషన్‌లో రెండు నిమిషాల సేపు స్టాపింగ్ కల్పించినట్లు తెలియజేశారు. ప్రయోగాత్మకంగా చేపట్టిన ఈ స్టాపింగ్‌ను కొన్ని నెలల తర్వాత పునఃసమీక్షిస్తారు.

'ఆరోగ్యానికి ప్రాధాన్యమివ్వాలి'

అనంతపురం క్లాక్‌టవర్/బత్తలపల్లి, జనవరి 23(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత పరిస్థితుల్లో ఆరోగ్యానికి అందరూ ప్రాధాన్యమివ్వాలని ఆర్డీటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అన్నె ఫెర్రర్ సూచించారు. గురువారం అల్ట్రామారథాన్ బత్తలపల్లి ఆర్డీటీ ఆసుపత్రి వద్ద ముగిసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆనందం, ఆశ జీవితానికి అవసరమన్నారు. క్రీడలు, సంప్రదాయాలు మన జీవన ప్రమాణాలకు అద్దం పడతాయన్నారు. కార్యక్రమంలో ఆర్డీటీ మహిళా సాధికారత డైరెక్టర్ విశాలా ఫెర్రర్, చైర్మన్ తిప్పేస్వామి పాల్గొన్నారు.

నలుగురు బీఎల్‌ఓలకు అవార్డులు

అనంతపురం టౌన్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): ఓటర్ల జాబితా ఎన్‌రోల్‌మెంట్‌లో అత్యంత ప్రతిభ కనపరిచిన బీఎల్‌ఓలకు కేంద్ర ఎన్నికల కమిషన్ బెస్ట్ ఎలెక్టోరల్ ప్రాక్టీస్ అవార్డు- 2024ను ప్రకటించింది. అందులో అనంత ఉమ్మడి జిల్లాలో నలుగురు బీఎల్‌ఓలు ఈ అవార్డుకు ఎంపికయ్యారు. అనంతపురం జిల్లాలో రాప్తాడు నియోజక వర్గానికి చెందిన వి. రూపా తేజశ్విని, రాయదుర్గం నియోజకవర్గానికి చెందిన సి. అంజలి ఎంపికయ్యారు. అలాగే శ్రీసత్యసాయి జిల్లాలో హిందూపురం నియోజకవర్గానికి చెందిన కేఎస్ గుణశేఖర్, పుట్టపర్తి నియోజకవర్గానికి చెందిన బి. రమాదేవి ఎంపికయ్యారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా శనివారం అవార్డులను అందించి అభినందించనున్నారు.

పట్ట పగలే రెండిళ్లలో చోరీ


దొంగలు తెరిచిన బీరువా

శింగనమల, జనవరి 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్లుమడి గ్రామంలో గురువారం పట్టపగలే రెండిళ్లలో చోరీ చేశారు. గ్రామానికి చెందిన నారాయణస్వామి, రామయ్య ఉదయం కుటుంబ సభ్యులతో కలిసి పొలాలకు వెళ్లారు. మధ్యాహ్నం గుర్తుతెలియని వ్యక్తులు పక్కపక్కనే ఉన్న వారిళ్లలోకి చొర బడ్డారు. నారాయణస్వామి ఇంట్లోని బీరువాలో ఉన్న 12 తులాల బంగారం ఆభరణాలు, రామయ్య ఇంట్లో రూ.10వేలు నగదు ఎత్తుకెళ్లారు. కొద్దిసేపటికి గమనించిన గ్రామస్థులు పోలీసులకు సమాచారం అందించారు. శింగనమల సీఐ కౌలుట్లయ్య ఎస్ఐ విజయ్‌కూమార్ ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. బాధితులు సాయంత్రం శింగనమల పోలీస్‌స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.

801 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, జనవరి 23(ఆంధ్రజ్యోతి): జీడిపల్లి రిజర్వాయర్‌కు గురువారం 801 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. ఔట్‌ఫ్లో కింద పేజ్-2కు 452 క్యూసెక్కులు వెళ్తున్నట్లు తెలిపారు.

పెద్దింట పుట్టిన పేదల మనిషి

ధనిక రైతు కుటుంబంలో జన్మించినా.. పేదల అభ్యున్నతి కోసం పాటుపడిన నాయకుడు జడ్ వీరారెడ్డి. విద్యార్థి దశ నుంచే సామాజిక స్పృహను పెంచుకున్న ఆయన.. మార్క్సిస్ట్ సాహిత్యాన్ని అధ్యయనం చేసి, కమ్యూనిస్టు భావజాలంతో ముందుకు సాగారు. రైతుగా, న్యాయవాదిగా, రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ క్రీడాకారుడిగా, సమితి ప్రెసిడెంట్‌గా ఆయన స్ఫూర్తిదాయకమైన జీవితాన్ని గడిపారు. శుక్రవారం ఆయన వర్ధంతి నేపథ్యంలో.. ప్రత్యేక కథనం. - ఆంధ్రజ్యోతి, గుత్తి


న్యాయవాదిగా, మార్క్సిస్టు నేతగా తనదైన ముద్ర
నేడు జడ్ వీరారెడ్డి వర్ధంతి

• విద్యార్థి దశలోనే అభ్యుదయ భావాలు • రైతు, కార్మిక సమస్యలపై పోరాటాలు

విద్యార్థి దశలోనే...

ప్రజలు గుత్తి తాలూకా పెద్దవడుగూరులో జన్మించిన వీరారెడ్డి, విద్యార్థి దశలోనే అభ్యుదయ భావాలవైపు ఆకర్షితులయ్యారు. ఆ తరువాత కమ్యూనిస్టు ఉద్యమకారుడిగా మారారు. పరిసరాల పరిశుభ్రత, గ్రంథాలయాల నిర్వహణ, దళితుల అభ్యున్నతి వంటి అంశాలకు ప్రాధాన్యం ఇచ్చారు. విద్యార్థి దశలో తన స్నేహితుడు కె.రామకృష్ణరెడ్డితో కలిసి శ్రమదానం చేసేవారు. ఆరోగ్యం, పరిశుభ్రత వంటి అంశాలపై ప్రజల్లో చైతన్యం పెంచారు. ప్రాథమిక విద్య అనంతరం ఉన్నత చదువుల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లారు. ఈ క్రమంలో మార్క్సిస్ట్ సాహిత్యాన్ని అధ్యయనం చేశారు. చదువు, క్రీడలు, రాజకీయ చర్చల్లో చురుగ్గా పాల్గొన్నారు.

ప్రేమ వివాహం

అనంతపురానికి డాక్టర్ ఆదిలక్ష్మిని జడ్ వీరారెడ్డి ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. 1964 ఆగస్టు 15న వీరి వివాహం జరిగింది. డాక్టర్ ఆదిలక్ష్మి మొదట గుంతకల్లు ఈఎస్ఐ ఆసుపత్రిలో విధులు నిర్వహించేవారు. ఆ తరువాత గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి బదిలీ అయ్యారు. ఇక్కడ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించారు. గ్రామీణ ప్రాంత మహిళల ఆరోగ్యం కోసం పాటుపడ్డారు. 'డాక్టరమ్మ.. ఆదిలక్ష్మమ్మ..' అని ఇక్కడి జనం ఆమెను గౌరవంగా పిలుచుకునేవారు. 2001లోడాక్టర్ ఆదిలక్ష్మి అనారోగ్యంతో మృతి చెందారు. తన స్వగ్రామం పెద్దవడూగురులో ఆమెను ఖననం చేశారు. భార్య సమాధి పక్కనే అప్పట్లోనే ఆయన ఆయన సమాధిని నిర్మించుకున్నారు.


జడ్ వీరారెడ్డి కాలనీలో నిర్మించుకున్న గృహాలు

రైల్వే కార్మికుల కోసం..

గుత్తి రైల్వే జంక్షన్‌గా ఉండటంతో, అక్కడ పనిచేస్తున్న కార్మికుల హక్కుల కోసం పని చేశారు. అప్పటి జిల్లా నాయకులు వీకే ఆదినారాయణరెడ్డితో కలిసి కార్మికులను కూడగట్టి అనేక కార్యక్రమాలు నిర్వహించారు. రైల్వే కార్మికులకు చట్టబద్ధంగా దక్కాల్సిన ప్రయోజనాల కోసం కోర్టుల ద్వారా, ప్రత్యక్ష పోరాటాల ద్వారా పాటుపడ్డారు. రైతు నేతగా, పంటలకు గిట్టుబాటు ధరలు, సాగునీరు తదితర సమస్యలపై పోరాటాలు కొనసాగించారు. తన 67 సంవత్సరాల వయస్సులో కూడా ఆయన పట్టు రైతులను సమీకరించేందుకు హిందూపురం ప్రాంతానికి వెళ్లారు. అక్కడ ఉద్యమంలో పాల్గొని, పోలీసుల లాఠీచార్జిలో గాయపడ్డారు. అనంతరం జిల్లా వ్యాప్తంగా పర్యటించి, రైతులను సంఘటితం చేశారు.


జడ్ వీరారెడ్డి కాలనీ

మార్క్సిస్ట్ పార్టీ నిర్మాణానికి కృషి

జిల్లాలో మార్క్సిస్ట్ పార్టీ నిర్మాణానికి 1985 నుంచి జడ్ వీరారెడ్డి తన వంతు కృషి చేశారు. 2002లో సీపీఎం రాష్ట్ర మహాసభలు అనంతపురంలో జరిగాయి. సభ విజయవంతానికి ఆయన కృషి చేశారు. సీపీఎంలో సీనియర్ నాయకుడైనా.. ఆయనలో ఎక్కడా అలాంటి భావం కనిపించేది కాదు. యువకులను ప్రోత్సహించేవారు. అందరితో కలిసి మెలసి ఉండేవారు. చివరి వరకు సీపీఎం నాయకుడిగా, రైతు సంఘం నేతగా సేవలందించిన జడ్ వీరారెడ్డి, జనవరి 24, 2005లో గుండె పోటుతో తుది శ్వాస విడిచారు. భార్య పక్కన ఆయన ఎంచుకున్న స్థలంలోనే ఖననం చేశారు. ఆయన పేరిట గుత్తి పట్టణంలో పార్టీ కార్యాలయాన్ని సీపీఎం నేతలు నిర్మించారు. గుత్తి పట్టణ శివారులో సీపీఎం ఆధ్వర్యంలో 300 మంది పేదలకు పోరాటాల ద్వారా ఇంటి స్థలాలను ఇప్పించారు. ఆ కాలనీకి 'జడ్ వీరారెడ్డి కాలనీ'గా నామకరణం చేశారు. అనేక మంది పేదలు ఇళ్లను నిర్మించుకుని అక్కడ ఉంటున్నారు.

ప్రజాసేవే పరమావధిగా..

ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ సభ్యత్వాన్ని స్వీకరించిన ఆయన, 1961లో లా పూర్తిచేసి న్యాయవాద వృత్తిని చేపట్టారు. వృత్తికి పరిమితం కాకుండా, ప్రజా ఉద్యమాల్లో కొనసాగారు. 1978 సీపీఐ తరుపున గుత్తి నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. అనంతరం గుత్తిలో స్థిరపడి, రైతు సమస్యలపై సంఘాల ద్వారా పోరాటాలు చేశారు. 1981లో జరిగిన సమితి ఎన్నికల్లో కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి భారీ మెజార్టీతో విజయం సాధించారు. సమితి అధ్యక్షుడిగా గుత్తి తాలూకాలో విస్తృతంగా పర్యటించారు. గ్రామాలలో పాఠశాలలు ఏర్పాటు చేయించారు. తాగునీరు, రోడ్లు, విద్యుత్ తదితర మౌలిక సదుపాయాల కల్పనకు విశేషంగా కృషి చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడం కోసం పోరాటాలు చేసి అభివృద్ధి పనులకు నిధులు తెప్పించారు. దీంతో గ్రామాల్లో కమ్యూనిస్టు పార్టీకి మంచి సంబంధాలు ఏర్పాడ్డాయి.

నిర్లక్ష్యానికి నిండుప్రాణం బలి

ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేస్తుండగా కరెంటు సరఫరా.. విద్యుదాఘాతంతో లైన్‌మన్ మృతి



ట్రాన్స్ ఫార్మర్‌పై లైన్‌మన్ మృతదేహం, శివకుమార్ (ఫైల్)

అగళి, జనవరి 23(ఆంధ్రజ్యోతి): నిర్లక్ష్యం నిండుప్రాణాన్ని బలిగొంది. కరెంటు సరఫరా నిలిపివేతలో నిర్లక్ష్యం కారణంగా లైన్‌మన్ విద్యుదాఘాతంతో మరణించాడు. మండలంలోని కురసాంగనపల్లి సమీపాన రైతు నగేశ్ పొలంలో గురువారం ఉదయం ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులు చేస్తున్న సమయంలో విద్యుత్ సరఫరా కావడంతో లైన్‌మన్ శివకుమార్ (47) అక్కడికక్కడే మరణించాడు. ట్రాన్స్‌ఫార్మర్‌పైనే కాలిపోయాడు. ఎస్ఐ వీరేష్, లైన్‌మన్ కుటుంబీకులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రొళ్లకు చెందిన శివకుమార్ రామనపల్లి లైన్‌మన్‌గా పనిచేస్తుండేవాడు. కురసాంగనపల్లి సమీపాన పొలంలోని ట్రాన్స్‌ఫార్మర్‌లో మరమ్మతులకు ఉపక్రమించాడు. ఎల్‌సీ తీసుకుని ఫ్యూజు వేస్తుండగా సబ్‌స్టేషన్ ఆపరేటర్ రాకేష్ నిర్లక్ష్యంగా విద్యుత్ సరఫరా చేశాడు. దీంతో విద్యుత్ షాక్ తగిలి లైన్‌మన్ శివకుమార్ అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న లైన్‌మన్ కుటుంబ సభ్యులు ప్రమాద స్థలానికి చేరుకుని, బోరున విలపించారు. అతడికి భార్య మాలతి, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. మాలతి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని మడకశిర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

బాధ్యులపై చర్యలు తప్పవు

సమాచారం అందుకున్న విద్యుత్ శాఖాధికారులు ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. లైన్‌మన్ మృతదేహాన్ని సందర్శించి, పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఏడీ నాగన్న మాట్లాడుతూ.. నిర్లక్ష్యం తో లైన్‌మన్ శివకుమార్ మృతికి కారణమైన చర్యలు తీసుకుంటామన్నారు. లైన్‌మెన్ కుటుంబాన్ని సంస్థ తరఫున ఆదుకుంటామన్నారు.

కౌలు రైతు ఆత్మహత్య


లక్ష్మీనారాయణ (ఫైల్)

నల్లమాడ, జనవరి23(ఆంధ్రజ్యోతి): మండలంలోని మసకవంకపల్లికి చెంది న కౌలు రైతు లక్ష్మీనారాయణ (45) అప్పుల బాధతో బుధవారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. లక్ష్మీనారాయణ మూడెకరాలు కౌలుకు తీసుకుని, పంటలు సాగు చేస్తుండేవాడు. పంట లు చేతికి అందక నష్టపోతుండేవాడు. అప్పులు పెరగడం, కుటుంబ పోషణ భారం కావడతో మనస్తాపం చెంది బుధవారం రాత్రి ఇంట్లోనే ఎవరూలేని సమయంలో ఉరేసుకుని, మరణించాడు. రైతు భార్య చంద్రకళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. రైతుకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. రైతు మృతదేహాన్ని కదిరికి తరలించారు.

క్రిష్ణాపురంలో టీడీపీ కార్యకర్త...


సుందరరాజు

బుక్కపట్నం, జనవరి23(ఆంధ్రజ్యోతి): మండలంలోని క్రిష్ణాపురం గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త సుందరరాజు(35) అప్పుల బాధ భరించలేక గురువారం ఆత్మహత్య చేసుకున్నాడు. బంధువులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సుందరరాజు ఆటో నడుపుకుంటూ జీవనం సాగించేవాడు. అతడి భార్య శాంతి కొన్నేళ్లుగా అనారోగ్యంతో మంచానికే పరిమితమైంది. ఆమె వైద్య ఖర్చులు, కుటుంబ పోషణ, పిల్లల చదువుకోసం సుందరరాజు రూ.5 లక్షలు అప్పులు చేశాడు. వాటిని తీర్చే మార్గం కనిపించక తీవ్ర మనస్తాపం చెంది గురువారం ఇంట్లో ఉరేసుకున్నాడు. కాసేపటికి చుట్టుపక్కలవారు గమనించారు. అప్పటికే అతడు మరణించాడు. సుందరరాజు తల్లి రామలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేసుకున్నట్లు ఎస్ఐ కృష్ణమూర్తి తెలిపారు. సుందరరాజుకు ఇంటర్ చదువుతున్న కుమార్తె, కుమారుడు ఉన్నారు. యజమాని మృతితో కుటుంబం వీధిన పడింది.

రైలు కింద పడి గుర్తుతెలియని వ్యక్తి..

గుంతకల్లుటౌన్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): గుంతకల్లు-డోన్ రైలు మార్గంలోని తుగ్గలి రైల్వే స్టేషన్ సమీపంలో బుధవారం రాత్రి ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ రైలు కింద పడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు జీఆర్పీఎస్ఐ మహేంద్ర గురువారం తెలిపారు. మృతుడికి 30 ఏళ్ల ఉంటాయన్నారు. అతడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదన్నారు. మృతదేహాన్ని గుంతకల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

పేట్రేగిపోతున్న దొంగలు

తాళం వేసిన ఇళ్లే టార్గెట్.. బెంబేలెత్తిపోతున్న ప్రజలు

ఊళ్లకు వెళ్లాలంటే జంకుతున్నవైనం

పోలీసు వ్యవస్థ నిద్రమత్తు వీడేదెన్నడో?



తాడిపత్రి, జనవరి 23(ఆంధ్రజ్యోతి): నిత్యం దొంగలు పేట్రేగిపోతున్నా పోలీసులు చోద్యం చూస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పట్టణ, పరిసర ప్రాంతాల్లో వారంరోజుల వ్యవధిలోనే వరుస చోరీలు జరిగాయి. పదికి పైగా ఇళ్లల్లో దొంగలు చోరీకి తెగబడ్డారు. తాళం వేసిన ఇళ్లనే దొంగలు టార్గెట్ చేస్తున్నారు. కొన్నిసార్లు పట్టపగలే ఇళ్లల్లోకి చొరబడి చోరీకి తెగబడుతున్నారు. ఈ సంఘటనలతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. పండుగలకు ఊళ్లకు వెళ్లాలంటేనే ప్రజలు భయపడుతున్నారు. సాధారణంగా రాత్రి సమయాల్లోనే దొంగలు తమ కానిస్తుంటారు. కానీ పోలీసుల ఉదాసీన వైఖరివల్ల దొంగలు పేట్రేగిపోతున్నారు. వారంరోజుల్లో దొంగతనాలను పరిశీలిస్తే.. పట్టణంలోని భగత్ సింగ్‌నగర్‌లోని పది ఇళ్లల్లో చోరీకి విఫలయత్నం చేశారు. ఒక ఇంటిలో దొరికిన చిన్నచిన్నవస్తువులతోపాటు ఐదు తులాల బంగారం ఆభరణాలను ఎత్తుకెళ్లారు. బస్టాండ్ ఎదురుగా ఉన్న షాపులోని సామగ్రిని ఎత్తుకెళ్లారు. యల్లనూరు రోడ్డు షాపుల్లో కూడా చోరీలు జరిగాయి. సుంకులమ్మపాలెంలో ఒకేరోజు ఆరుఇళ్లల్లో చోరీ జరగగా మూడిళ్లల్లో రూ.20వేల వరకు నగదు అపహరణకు గురైంది. శ్రీనివాసపురంలో పట్టపగలే ఉపాధ్యాయుల ఇళ్లల్లో చొరబడి బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లారు. గాజుల క్రిష్టప్ప వీధిలో ముగ్గు వేస్తున్న మహిళ మెడలో నుంచి గుర్తుతెలియని దుండగుడు బంగారు చైన్‌ను లాక్కొని పరారయ్యాడు. విజయనగర్‌కాలనీ, మెయిన్‌బజారు, దినసరి కూరగాయల మార్కెట్, బస్టాండ్ ప్రాంతాల్లో బయట పార్కింగ్ చేసిన వాహనాలను సైతం ఎత్తుకెళుతున్నారు. వరుస చోరీలతో బెంబేలెత్తిపోతున్న ప్రజలు సంక్రాంతి పండుగకు ఊళ్లకు వెళ్లలేక పోయారు. రాత్రి సమయాల్లోనే కాదు పట్టపగలు కూడా దొంగలు విరుచుకుపడుతున్నారు.

నిద్రమత్తు వీడేదెన్నడో..?

పట్టణంలో మట్కా, పేకాట, చోరీలు వరుసగా జరుగుతున్నా పోలీసులు నిద్రమత్తు వీడడం లేదు. ఇటీవల ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'విస్తరిస్తున్న మట్కా' కథనానికి స్పందించిన పోలీసు అధికారులు అడపాదడపా దాడులు నిర్వహిస్తూ చేతులు దులుపుకుంటున్నారన్నారు. కూకటివేళ్లతో సహా నిర్మూలించాల్సిన పోలీసులు ఆ వైపుగా అడుగులు వేయడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. చోరీలపై పోలీసులు పట్టించుకోకపోవడంతో దొంగలకు తాడిపత్రి అడ్డాగా మారిపోయింది. వరుస దొంగతనాలు జరుగుతున్నా పోలీసులు నిద్రమత్తు వీడలేదనే విమర్శలు ఉన్నాయి.


బీరువాను పగలగొట్టిన దొంగలు (ఫైల్)

కొరవడిన గస్తీ..



రాత్రి సమయాల్లో పోలీసుల గస్తీ కొరవడింది. ఏదైనా జరిగినప్పుడు మాత్రం ఆ రెండుమూడురోజులు రాత్రి సమయాల్లో గస్తీ నిర్వహించడం.. తర్వాత తిలోదకాలు ఇవ్వడం పోలీసులకు పరిపాటిగా మారింది. దొంగలు రాత్రి సమయాల్లోనే ఎక్కువగా చోరీలకు పాల్పడే అవకాశాలు ఉన్నాయి. కానీ పోలీసులు రాత్రి డ్యూటీని మరచిపోయి చాన్నాళ్లు అవుతోందని ప్రజలు చర్చించుకుంటున్నారు. పట్టణంలోని ఇన్నిదాడులు, దొంగతనాలు జరుగుతున్నా పోలీసులకు చీమకుట్టినట్లు కూడా లేదని ప్రజలు విమర్శిస్తున్నారు.

చోరీల నియంత్రణకు ప్రత్యేక టీం



చోరీల నిర్మూలనపై ప్రత్యేక టీం ఏర్పాటు చేశాం. త్వరలోనే దొంగలను పట్టుకుంటాం. సీసీ పుటేజీల్లో కనిపించిన వ్యక్తులపై నిఘా పెట్టాం. దొంగలను పట్టుకోవడానికి శక్తివంచన లేకుండా కృషిచేస్తున్నాం.

-సాయిప్రసాద్, పట్టణ సీఐ

బెల్టు తీసేదెవరు..?

ఉమ్మడి జిల్లాలో మద్యం దుకాణాలు 223

- బెల్టు షాపుల సంఖ్య 1200కు పైమాటే
- ప్రతి మద్యం దుకాణానికి అనధికారిక పర్మిట్ రూములు
- మిలటరీ మద్యం పేరుతో జోరుగా విక్రయాలు
- కర్ణాటక నుంచి టెట్రా ప్యాకెట్ల అక్రమ రవాణా
- నియంత్రణకు అధికారుల మీనమేషాలు
- మామూళ్ల మత్తులో యంత్రాంగం



అనంతపురం, జనవరి 23(ఆంధ్రజ్యోతి): ఎక్కడైనా బెల్టుషాపులు నిర్వహించినా... ఎవరైనా ప్రోత్సహించినా ఉపేక్షించేది లేదు. బెల్టుషాపుల వ్యవహారంలో కలుగజేసుకుంటే బెల్టు తీస్తానని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు పదే పదే చెబుతూ వచ్చారు. బెల్టుషాపుల నిర్వహణలో ఎమ్మెల్యేలు జోక్యం చేసుకున్నా సీరియస్‌గా పరిగణిస్తానని ఆయన ప్రతి వేదికలోనూ ఆదేశించారు. అధికారులను సైతం అదే స్థాయిలో హెచ్చరించారు. అయితే ఉమ్మడి అనంతపురం జిల్లాలో సీఎం ఆదేశాలకు భిన్నంగా బెల్టుషాపుల నిర్వహణ మూడు క్వార్టర్లు ఆరు ఫుల్‌లుగా కొనసాగుతోంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా... 223 మద్యం దుకాణాలుంటే... వాటి పరిధిలో ఇప్పటికే 1200కుపైగా బెల్టుషాపులు నిర్వహిస్తున్నారంటే... ఊరూరా షాపులు వెలిశాయన్నది నిర్వివాదాంశం. బెల్టుషాపులను అరికట్టాల్సిన సంబంధిత ఎక్సైజ్ అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారన్నది స్పష్టంగా అర్థమవుతోంది.

అధికార పార్టీ నేతల కనుసన్నల్లోనే..

ఉమ్మడి జిల్లాలో మెజార్టీ మద్యం దుకాణాలు కూటమి ప్రభుత్వంలోని అధికార పార్టీ నేతల కనుసన్నల్లోనే నడుస్తున్నాయి. అనంతపురం జిల్లాలో 136 మద్యం దుకాణాల పరిధిలో దాదాపు వందకుపైగా ఆ వర్గాలకు చెందినవే. సత్యసాయి జిల్లాలో 87 మద్యం దుకాణాల్లో 70కిపైగా కూటమి నేతలవే. ఈ నేపథ్యంలో ఆయా మద్యం దుకాణాల ద్వారా మద్యాన్ని బెల్టుషాపులకు విక్రయిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు దుకాణాల నుంచి మద్యాన్ని ఎమ్మార్పీ ధరలకే కొనుగోలు చేసిన బెల్టుషాపు నిర్వాహకులు మందుబాబులకు క్వార్టర్ బాటిల్‌పై అదనంగా రూ.30లకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. మద్యం విక్రయాలు పెద్ద మొత్తంలో జరగడం ద్వారా ప్రభుత్వం నుంచి వస్తున్న పర్సంటేజీ పెరుగుతుందనే ఆశతో దుకాణాల నిర్వాహకులు బెల్టుషాపులను ప్రోత్సహిస్తున్నారన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. ఊరూరా బెల్టుషాపులు ఏర్పడటానికి మద్యం దుకాణాల నిర్వాహకులే ప్రధాన కారణమన్న వాదన బలంగా వినిపిస్తోంది. ఉమ్మడి జిల్లాలోని ప్రతి నియోజకవర్గంలో అధికార పార్టీ నేతల ప్రోత్సాహంతోనే బెల్టుషాపుల నిర్వహణ కొనసాగుతోందన్న విమర్శలు లేకపోలేదు.

అనధికారిక పర్మిట్ రూములు

అనధికారిక పర్మిట్ రూముల నిర్వహణ... ప్రతి మద్యం దుకాణానికి పక్కనే అనధికారికంగా పర్మిట్ రూమును ఏర్పాటు చేసుకొని అక్కడే మద్యం తాగిస్తున్నారు. ప్రభుత్వం నుంచి పర్మిట్ రూములకు అనుమతులు లేకపోయినా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అనధికారికంగా నిర్వహిస్తున్నారు. దీనికి ప్రధాన కారణం కూటమి ప్రభుత్వంలోని పార్టీల నాయకుల ప్రమేయమనడంలో ఎలాంటి సందేహం లేదు. పర్మిట్ రూములను ఎవరు అడ్డుకుంటారనే ధీమా ఆ వర్గాల్లో ఉండటంతోనే నిర్వహిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. మరీ ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లోనే ఈ వ్యవహారం జోరుగా సాగుతోంది. ఉదాహరణకు అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో ఏ మద్యం దుకాణానికి వెళ్లినా పక్కనే పర్మిట్ రూము ఏర్పాటు చేసుకొని దర్జాగా మద్యం తాగించేస్తున్నారు.



మిలటరీ మద్యం పేరుతో..

మిలిటరీ మద్యం పేరుతో ఎమ్మార్పీ లేకుండా జోరుగా మద్యం విక్రయాలు జరుగుతున్నాయి. రోజుకు పెద్ద మొత్తంలో మద్యం విక్రయిస్తున్నారు. ప్రైవేట్ మద్యం దుకాణంలో లభించే ఫుల్ బాటిల్ కంటే... 40 నుంచి 50 శాతం తక్కువ ధరకు మిలిటరీ మద్యం పేరుతో మద్యాన్ని విక్రయిస్తుండటంతో ఎక్కువ మంది మందుబాబులు ఆ మద్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. ఎక్కడ పార్టీలు జరిగినా... మిలిటరీ మద్యమే దర్శనమిస్తోంది. ఇంత పెద్ద మొత్తంలో మిలిటరీ మద్యం ఎక్కడ నుంచి సరఫరా అవుతోందో అంతుపట్టని పరిస్థితి. మిలిటరీలో పనిచేసే సైనికులు, మాజీ సైనికులకు మాత్రమే ఆర్మీ క్యాంటిన్‌లో వారి వారి హోదాను బట్టి కేటాయించిన లిక్కర్ కార్డుకు నెలకు నాలుగు నుంచి 8 ఫుల్‌బాటిళ్లు అందజేస్తున్నారు. ఇందులో కొందరు వారి సొంత అవసరాలకు వినియోగించుకోగా... మరికొందరు బయటి వ్యక్తులకు ఆర్మీలో లభించే ధర కంటే రూ.200 నుంచి రూ.300కు అధికంగా విక్రయిస్తున్నారు. అలా అని ఆర్మీ క్యాంటిన్ ద్వారా పంపిణీ చేసే మద్యం, బయట వ్యక్తులు మిలిటరీ మద్యం పేరుతో విక్రయిస్తున్న మద్యానికి పొంతన లేకుండా పోతోంది. దీని వెనుక మిలిటరీ మద్యం పేరుతో ఇతర ప్రాంతాల నుంచి ఉమ్మడి జిల్లాకు పెద్ద ఎత్తున మద్యం రవాణా అవుతోందనడంలో ఎలాంటి సందేహం లేదు. ఇదిలా ఉండగా.... ప్రైవేట్ మద్యం దుకాణాల్లో క్వార్టర్ బాటిల్ అంటే 180 ఎంఎల్ రూ.99లకు లభిస్తోంది. ఈ నేపథ్యంలో... కొందరు మద్యం విక్రయదారులు, బెల్టుషాపు నిర్వాహకులు ఉమ్మడి జిల్లాకు సరిహద్దు ప్రాంతాల్లోని బళ్లారి, బెంగళూరు తదితర ప్రాంతాల నుంచి రూ.45లకు లభించే టెట్రా ప్యాకెట్లను భారీ ఎత్తున కొనుగోలు చేసి విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

హోటళ్లు, రెస్టారెంట్లు, డాబాల్లో విచ్చలవిడిగా..

ప్రభుత్వం అధికారికంగా కేటాయించిన బార్లలో మాత్రమే మద్యం తాగేందుకు అనుమతులున్నాయి. అయితే ఉమ్మడి జిల్లాలో ఏ రెస్టారెంట్, హోటల్, డాబాలకు వెళ్లినా జోరుగా మద్యం తాగిస్తున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఇక జాతీయ రహదారి పొడవునా ఉన్న మెజార్టీ హోటళ్లలో నిర్భీతిగా మద్యం తాగేందుకు ప్రత్యేకంగా గదులు ఏర్పాటు చేశారు. గుత్తి సరిహద్దు నుంచి కొడికొండ చెక్‌పోస్టు వరకూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది. పట్టణ ప్రాంతాల్లోనూ అదే ఒరవడి కొనసాగుతోంది. ఇలా ఎక్కడికక్కడ ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కుతున్నారు.

మామూళ్ల మత్తు

ఉమ్మడి జిల్లాలోకి పెద్ద ఎత్తున గోవా మద్యం దిగుమతైనా... ఊరూరా బెల్టుషాపులు నిర్వహిస్తున్నా... మిలిటరీ మద్యం పేరుతో జోరుగా విక్రయాలు సాగిస్తున్నా... హోటళ్లు, డాబాలు, రెస్టారెంట్లల్లో మద్యం తాగిస్తున్నా... కర్ణాటక నుంచి టెట్రా ప్యాకెట్లు దిగుమతి చేసుకుంటున్నా... ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పర్మిట్ రూములు నిర్వహిస్తున్నా... నియంత్రించే నాథుడు కాదు కదా.. పట్టించుకునే వారే కరువయ్యారు. సంబంధిత అధికారులు బాధ్యతలను విస్మరిస్తూ మీనమేషాలు లెక్కిస్తున్నారు. దీని వెనుక అటు సివిల్ పోలీసులు, ఇటు ఎక్సైజ్ పోలీసులు పరస్పర అవగాహనతో నియంత్రణపై చొరవ చూపలేదన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలోనే నియంత్రణ మరిచి నెలవారీ మామూళ్ల మత్తులో జోగుతున్నారన్న విమర్శలు లేకపోలేదు. ఉన్నతాధికారులు సైతం చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు లేకపోలేదు. ఇలాంటి పరిస్థితుల్లో బెల్టుషాపులు నిర్వహిస్తున్న వారిపై బెల్టు తీసేదెవరో అధికార యంత్రాంగమే సెలవివ్వాలి.

సర్పంచ్‌పై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

ముదిగుబ్బ, జనవరి 23(ఆంధ్రజ్యోతి): ఈదులపల్లి వైసీపీ మద్దతు సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డిపై ఎస్సీ, ఎస్టీ వేధింపుల చట్టం కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. వైసీపీ హయాంలో వలంటీర్‌గా పనిచేస్తున్న ఓ యువతికి మాయమాటలు చెప్పి 2021లో సర్పంచ్ పెళ్లి చేసుకున్నాడు. రహస్యంగా అనంతపురంలో పెట్టాడు. 2022లో ఆమెకు కుమారుడు పుట్టి, మరణించాడు. ప్రస్తుతం ఆమె రెండు నెలల గర్భవతి. ఈ నేపథ్యంలో తనను వదిలించుకోవడానికి కులం పేరుతో దూషించి, చంపుతానని బెదిరిస్తున్నాడని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ధర్మవరం డీఎస్పీ హేమంత్‌కుమార్ తెలిపారు. సర్పంచ్ ప్రభాకర్ రెడ్డికి ఇదివరకే వివాహమైంది. ఇద్దరు పిల్లలు కూడా ఉన్నారు.

న్యూస్ బాక్స్

ఘనంగా సుభాష్ చంద్రబోస్ జయంతి

ధర్మవరం, జనవరి 23(ఆంధ్రజ్యోతి):స్వాతంత్ర సమరయోధుడు సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలను స్థానిక బ్రిలియంట్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో గురువారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ సీవీ శేషు, విద్యార్థులు సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

● బుక్కపట్నం : మండలంలోని లింగప్పగారిపల్లి మండలపరిషత్ ప్రాథమిక పాఠశాలలో సుబాస్ చంద్రబోస్ 128వ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో హెచ్ఎం నరసింహమూర్తి, ఉపాధ్యాయ సంఘం జిల్లా కార్యదర్శి సురేష్‌బాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కదిరి సబ్ జైలు తనిఖీ


మాట్లాడుతున్న శివప్రసాద్

కదిరిలీగల్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక సబ్‌జైలును డీఎల్ఎస్ఏ కార్యదర్శి శివ ప్రసాద్ యాదవ్ గురువారం తనిఖీ చేశారు. సమస్యలపై ఖైదీలతో ఆరా తీశారు. నేరాలు, దోపిడీలకు పాల్పడినా... తాగుడు, జూదము, గంజాయి తదితర దురలవాట్లకు బానిసైనా.. కుటుంబంలో జరిగే దుష్పరిణామాలను వివరించారు. న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఖైదీలకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సదస్సులో న్యాయవాది లోకేశ్వర్‌రెడ్డి, సభ్యులు అధికారి వాసుదేవ రెడ్డి పాల్గొన్నారు.

అధికారులపై చర్యలు తీసుకోవాలి

కదిరి అర్బన్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): బీసీ సంక్షేమ వసతి గృహాల్లో అక్రమాలకు పాల్పడుతున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని అఖిల పక్ష విద్యార్థి సంఘల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌లో ఆందోళన చేపట్టిన ఆ నాయకులు మాట్లాడారు. వసతి గృహాల్లో మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం పెట్టడంలేదని, పౌష్టిక ఆహారాన్ని ఇవ్వడం లేదని ఆరోపించారు. డివిజన్ స్థాయి అధికారి తనిఖీల పేరుతో వార్డెన్లను ఇబ్బంది పెడుతూ వారి నుంచి మామూళ్లు వసూళ్లు చేస్తున్నారన్నారు. వార్డెన్లు కూడా విద్యార్థులు హాజరు శాతం ఎక్కువ చూపిస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారన్నారు. ఉన్నతాధికారులు వీరిపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు మహేంద్ర, బాబ్‌జాన్, మహేంద్రరాజు, చంద్ర పాల్గొన్నారు.

ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ తనిఖీ

నల్లచెరువు, జనవరి 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎం. అగ్రహారం ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌ను డిప్యూటీ డీఎంహెచ్ఓ నాగేంద్ర గురువారం తనిఖీ చేశారు. క్లీనిక్ పరిసరాలను పరిశీలించారు. అనంతరం ఓపీ, వాటర్ టెస్టింగ్, మాతశిశు ఆరోగ్య సేవలు, స్కూల్‌హెల్త్‌కు సంబంధించిన ఆర్‌డీఎస్‌కే రిజిస్టర్లను పరిశీలించారు. ఆయన వెంట వైద్యాధికారిణి కల్పన, ఎంఎల్‌హెచ్‌పీ శ్రావణి, ఏఎన్ఎం సరస్వతి, ఆశకార్యకర్తలు స్వర్ణ ఉన్నారు.

డీపీహెచ్ఈఈ నరసింహమూర్తికి ఉద్యోగోన్నతి

పుట్టపర్తిరూరల్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): మునిసిపల్ పబ్లిక్‌హెల్త్ డిప్యూటీ ఇంజనీరు నరసింహమూర్తి జిల్లా పబ్లిక్ హెల్త్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా ఉద్యోగోన్నతి పొందారు. ఈ మేరకు ఎస్ఈ అనంతపురం గురువారం ఉత్తర్వులు జారీచేశారు. ఈ ఆదేశాలు వెంటనే అమల్లోకి వస్తాయని ఆ ఉత్తర్వులో పేర్కొన్నారు.

డీలర్ల సమస్యపై ఆరా

ఓబుళదేవరచెరువు, జనవరి 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ చౌకధాన్యపు డిపో డీలర్ల సమస్యపై తహసీల్దార్ అనంతాచారి, సిఎస్‌డిటీ విజయనిర్మల ఆరా తీశారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యక్రమంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. తుకాల్లో వ్యత్యాసం లేకుండా చూడాలని, సకాలంలో లబ్ధిదారులకు నిత్యవసర వస్తువులు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి, ఆర్ఐ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

బాల్యవివాహాలను అరికడదాం

తనకల్లు, జనవరి 23(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో బాల్య వివాహాలను అరికట్టడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నల్లచెరువు ఐసీడీఎస్ సీడీపీఓ గంగరత్న సూచించారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ శోభాసువర్ణమ్మ, సమత సంస్థ జిల్లా కో-ఆర్డినేటర్ శ్రీనివాసనాయుడు, మౌనిక, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు లక్ష్మీదేవమ్మ, జయమ్మ, మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన ఏఎన్ఎంలు, వీఆర్ఓలు, మహిళ పోలీసులు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

మచ్చతెగుళ్ల నివారణకు చర్యలు చేపట్టండి

ధర్మవరంరూరల్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత వాతావరణ మార్పుల పరిస్థితుల వల్ల రబీలో సాగుచేసిన వేరుశనగకు మచ్చతెగుళ్లు ఆశించిందని, ఈ తెగుళ్ల నివారణకు చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి ముస్తఫా రైతులకు సూచించారు. గురువారం మండలంలోని నాగలూరు గ్రామంలో రైతులు సాగుచేసిన వేరుశనగను పరిశీలించారు. వేరుశనగలో మచ్చతెగుళ్ల నివారణకు ఆజాక్సిస్ట్రోబిన్ 11 శాతం, టుబుకొనజోల్18.3 శాతం మందులను లీటర్ నీటికి 2ఎంఎల్ కలిపి పిచికారి చేసుకోవాలన్నారు. అదేవిధంగా లేతదశలో ఉన్న పైరుకు ఆకుమచ్చ తెగుళ్లు సోకిందని, వీటి నివారణకు సాఫ్ కార్బండజిమ్ 12 శాతం, మ్యాంకోజెబ్ 63 శాతం మందులను రెండు గ్రాముల చొప్పున లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు. అదేవిధంగా పూత దశలో ఉన్న వేరుశనగ పంటకు 200కేజీల జిప్సం వేసుకుంటే కాయ నాణ్యత, నూనే శాతం పెరిగి, దిగుబడి బాగా వస్తుందని సూచించారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం

ఓబుళదేవరచెరువు, జనవరి 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాయనకోటతండాకు చెందిన బీజేపీ సీనియర్ కార్యకర్త ఎస్టీ మోర్చా వెంకటరమణ నాయక్ తండ్రి హేమ్లానాయక్ అనారోగ్యంతో మృతి చెందారు. గురువారం మృతుని కుటుంబానికి బీజేపీ రాష్ట్ర ఎస్టీ మోర్చా ఉపాధ్యక్షుడు భాస్కర్‌నాయక్ రూ. పదివేలు అందించారు.

అల్ట్రా మారథాన్‌కు ఘనస్వాగతం

ధర్మవరంరూరల్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): ఆర్డీటీ సంస్థ ఆధ్వర్యంలో స్పెయిన్ దేశస్థులు నిర్వహించిన పదో అల్ట్రా మారథాన్‌కు గురువారం మండలంలోని చిగిచెర్లలో ఘన స్వాగతం లభించింది. ఆర్డీటీ రీజనల్ డైరెక్టర్ ప్రమీల, ఏటీఎల్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో గ్రామస్థులు వారికి ఘనస్వాగతం పలికారు. స్పెయిన్ దేశస్థులు మన్నీల నుంచి చిగిచెర్ల, ముష్టూరు మీదుగా బత్తల పల్లికి వెళ్లారు. చిగిచె ర్లలో మహిళలు, విద్యార్థులు, గ్రామస్థులు తప్పెట్లుతో ప్లకార్డులు పట్టుకుని హారతులు ఇచ్చి స్వాగతం పలికారు.

మసకబారుతున్న వెలుగులు..!

- 'పీఎం సూర్యఘర్'కు ఆదరణ అంతంతే
- అవగాహన కల్పించడంలో అధికారుల నిర్లక్ష్యం
- రుణాలిచ్చేందుకు సహకరించని బ్యాంకర్లు
- నీరుగారుతున్న లక్ష్యం


ఇంటిపై సోలార్ ప్యానల్స్ అమర్చుతున్న సిబ్బంది

కదిరి అర్బన్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): విద్యుత్ ఆదా పెంచేందుకు, ప్రతి ఇంటిని ఓ విద్యుత్ ఉత్పత్తి కేంద్రంగా మార్చేందుకు పీఎం సూర్యఘర్ యోజనను కేంద్ర ప్రభుత్వ ప్రవేశపెట్టింది. సామాన్యులకు విద్యుత్ బిల్లుల భారం నుంచి ఉపసమనం కలిగించే దిశగా సబ్సిడీ ఇచ్చేలా ఈ పథకాన్ని రూపొందించింది. అయితే ఈ పథకం వలన కలిగే ప్రయోజనాలు ఆశించిన స్థాయిలో లేవు. ప్రజలకు దీనిపై పూర్తి స్థాయిలో అవగాహన లేకపోవడమే ఇందుకు కారణం.

● వచ్చిన దరఖాస్తులు 599

కదిరి డివిజన్ పరిధిలో మొత్తం 599 దరఖాస్తులు వచ్చాయని అధికారులు చెబుతున్నారు. వీటిలో ఐదుగురికి మాత్రమే అనుమతులించి, సోలార్ ప్యానల్స్ బిగించినట్లు ఆ శాఖాధికారులు చెబుతున్నారు. మిగిలిన 594 మందికి సబ్సిడి జమకావల్సి ఉంది. ఈ పథకం వచ్చి నెలలు గడుస్తున్నా, వచ్చిన దరఖాస్తులో చాలా వాటికి సోలార్ ప్యానల్స్‌ను ఏర్పాటు చేయలేక పోయారు. దీనివలన కలిగే ప్రయోజనాలను వివరించడంలో అధికారులు విఫలమవుతున్నారు. కేవలం కరపత్రాల పంపిణీకే పరిమితం కావడతో వినియోగదారుల్లో ఈపథకంపై ఎలాంటి అవగాహన లేకుండా పోయింది. బ్యాంకర్లు కూడా రుణాలిచేందుకు ముందుకు రాకపోవడంతో ఆశించిన స్థాయిలో ఈ పథకం ముందుకు సాగడంలేదు.

● ఎస్టీ, ఎస్సీ వినియోగదారులకు అవకాశం

ప్రతి ఇళ్లు ఒక సౌర విద్యుత్ శక్తి ఉత్పత్తాదక కేంద్రంగా కావాలని భావిస్తున్న కేంద్ర ప్రభుత్వ ఆశయం నీరు గారింది. ఇలా ఉంటే 200 యూనిట్లు లోపు కరెంటు బిల్లులు వచ్చే ఎస్సీ, ఎస్టీలకు పీఎం సూర్యఘర్ యోజనపై సబ్సిడి సోలార్ ప్యానల్స్‌నే ఏర్పాటు చేయడానికి అధికారులు రంగం సిద్ధం చేశారు.

● గరిష్టంగా రూ. 78వేలు రాయితీ

పీఎం సూర్యఘర్ పథకం ద్వారా దేశ వ్యాప్తంగా కోటి గృహాలకు సౌర విద్యుత్ ఏర్పాటుకు రాయితీ ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఒక్కొక్క ఇంటిపై గరిష్ఠంగా మూడు కిలో వాట్స్ యూనిట్లకు రూ.78వేల రాయితీ ఇస్తోంది. అందులో కిలోవాట్‌కు రూ. 30వేలు, రెండు కిలోవాట్లకు రూ.60వేలు, మూడుకిలో వాట్లకు రూ.78వేల చొప్పన రాయితీ ఇస్తోంది. మూడు కిలోవాట్ల సామర్థ్యం కలిగిన సోలార్ ప్యానల్ ఏర్పాటుకు రూ. లక్ష 45వేలు ఖర్చు అవుతుంది. ఇందులో కేంద్రం గరిష్టంగా రూ. 78వేలు భరిస్తుంది. మిగిలిన మొత్తాన్ని పూచీ కత్తులేకుండా తక్కువ వడ్డీకి బ్యాంక్‌ల ద్వారా రుణాలు ఇప్పిస్తుంది.

అవగాహన కల్పిస్తున్నాం

కేంద్ర ప్రభుత్వం పీఎం సూర్యఘర్ పథకానికి విరివిగా రాయితీ, రుణాలు అందిస్తాం. ఏర్పాటు చేసుకున్న వారందరికి కేంద్రం రాయితీ ఇస్తుం ది. ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా ఈ పథకం అమలు చేస్తాం. ఎంతమంది దరఖాస్తులు చేసుకున్నా, అనుమతులు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాం. సందేహలుంటే ఏఈలను సంప్రందిస్తే నివృత్తి చేస్తారు.

- మోసెస్, ఈఈ, కదిరి డివిజన్


పుట్టపర్తి : పల్లె క్యాంపు కార్యాలయంలో కేక్‌కట్ చేస్తున్న నాయకులు

ఘనంగా నారా లోకేశ్ జన్మదినం

పుట్టపర్తిరూరల్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): మంత్రి నారా లోకేష్ జన్మదిన వేడుకలను నియోజకవర్గవ్యాప్తంగా తెలుగుదేశంపార్టీ నాయకులు, కార్యకర్తలు గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో టీడీపీ అర్బన్ కన్వీనర్ రామాంజినేయులు ఆధ్వర్యంలో కేక్‌కట్ చేశారు. సత్యసాయి సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి వద్ద ఊరువాకిలి సురేష్ నాయుడు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందు లో జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, పుడా మాజీ చైర్మన్ కడియాల సుధాకర్ నాయుడు, మునిసిపల్ మాజీ చైర్మన్ బెస్త చలపతి, మైనారిటీ నాయకులు మహమ్మద్‌రఫీ, ఉమాపతి యాదవ్ పాల్గొన్నారు.


ధర్మవరం : టీడీపీ కార్యాలయంలో సంబరాలు

● ధర్మవరం : స్థానిక టీడీపీ కార్యాలయంలో కేక్‌కట్ చేశారు. ఇందులో టీడీపీ పట్టణ అధ్యక్షుడు పరిశే సుధాకర్, ఏపీసీడ్స్ రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ కమతం కాటమయ్య, నాయకులు చింతలపల్లి మహేశ్‌చౌదరి, పణికుమార్, పురుషోత్తంగౌడ్, మాధవరెడ్డి పాల్గొన్నారు. అదేవిధంగా తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్నూరు విజయ్‌చౌదరి ఆధ్వర్యంలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద కేక్‌కట్ చేశారు.


కదిరి : కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు

● కదిరి : స్థానిక వేమారెడ్డిసర్కిల్, అన్నక్యాంటిన్ వద్ద కేక్ కట్ చేశారు. అన్న క్యాంటిన్‌లో ఒకరోజు భోజనాన్ని తెలుగు యువత నియోజకవర్గం అధ్యక్షుడు కొమ్మినేని గంగన్నయుడు అందించారు. కార్యక్రమంలో పట్టణాధ్యక్షుడు డైమండ్ ఇర్ఫాన్, మోపూరి శెట్టి చంద్రశేఖర్, కోయ్య రాజేంద్రనాయుడు, గోపాల్‌నాయుడు, ప్రవీన్‌కుమార్ పాల్గొన్నారు.

● అలాగే బుక్కపట్నం, ముదిగుబ్బ, ఓబుళదేవరచెరువు, నల్లమాడలో ఆయా మండలాల నాయకులు కేక్ కట్ చేశారు.

పాఠశాలలో రేకులషెడ్ ఏర్పాటు


రేకులషెడ్ ఏర్పాటు చేయించిన టీడీపీ నాయకులు

ముదిగుబ్బ, జనవరి 23(ఆంధ్రజ్యోతి): స్థానిక వడ్డిపేట ప్రాథమిక పాఠశాలలో టీడీపీ నాయకులు వంటగదికి సొంతనిధులతో రేకులషెడ్‌ను ఏర్పాటు చేశారు. పాఠశాలలోని వంటగదికి మౌలిక సదుపాయాలు లేక ఇబ్బందులు పడుతున్నామని మెగా పేరెంట్స్ మీటింగ్‌లో పాఠశాల ఉపాధ్యాయులు టీడీపీ మండల క్లస్టర్ ఇన్‌చార్జ్ తుమ్మల మనోహర్ దృష్టికి తెచ్చారు. టీడీపీ నాయకుడు ఉత్తమ నాయుడుతో కలిసి సొంత నిధులతో వంటగదికి రేకులషెడ్ ఏర్పాటు చేయించారు. పరిటాల రవీంద్ర 20వ వర్ధంతి సందర్భంగా ఆయన జ్ఞాపకార్థం రేకులషెడ్‌ను పాఠశాలకు వితరణ చేశారు. కార్యాక్రమంలో ఎంఈఓ రమణప్ప, ఉపాధ్యాయులు ఆయుడు, రామంజి, టీడీపీ నాయకులు కొలసాని చంద్ర, గోనుగుంట్ల సూరి, చంద్రసేన, సురేశ్, రామ్మూర్తి, వెంకటరవి, నరసింహ పాల్గొన్నారు.

ఉల్లాస్‌తో వయోజనులకు విద్య

గాండ్లపెంట, జనవరి 23(ఆంధ్రజ్యోతి) : వయోజనులను విద్యావంతులుగా తీర్చిదిద్దడానికి ప్రభుత్వం ఉల్లాస్ అనే కార్యక్రమాన్ని చేపట్టిందని వయోజన విద్య ప్రోగ్రామ్ చైర్మన్ వెంకటరమణారెడ్డి తెలిపారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన వలంటీర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 23 నుంచి 50 రోజుల పాటు వలంటీర్ల ద్వారా వయోజనలకు విద్యా శిక్షణ అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో వయోజన విద్య ఏపీఓ జనార్ధన్‌గౌడ్, ప్రోగ్రాం కన్వీనర్ రవీంద్ర, సుధాకర్, ఏపీఎం సూర్యనారాయణ, ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.

కాలువలో పడి చిన్నారికి గాయాలు

కొత్తచెరువు, జనవరి 23(ఆంధ్రజ్యోతి): స్థానిక బీసీ కాలనీ సమీపంలో డ్రైనేజీ నిర్మాణానికి కాలువను నెలరోజుల క్రితం తవ్వారు. అయితే డ్రైనేజీ నిర్మాణం చేపట్టకపోవడంతో కాలనీకి వెళ్లేందుకు కూడా దారి లేదు. అయితే ఈ కాలువ తీయడం వల్ల సమీప ఇళ్లలోని పిల్లలు ఆడుకుంటూ ఆ కాలువలోకి పడి గాయపడుతున్నారు. గురువారం ఉదయం మంజుల, కాటమ్మ కుమారుడు విహాన్ ఆడుకుంటూ కాలువలో పడ్డాడు. దీంతో ఆ చిన్నారికి కంటిపైన గాయమైంది. నాలుగు కుట్లు పడ్డాయి. అధికారులు స్పందించి డ్రైనేజీ కాలువ నిర్మాణం త్వరగా చేపట్టాలని కాలనీ వాసులు కోరారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ధర్మవరం, జనవరి 23(ఆంధ్రజ్యోతి): స్థానిక సబ్‌జైలు వద్ద గురువారం రెండు బైకులు ఢీకొన్న ప్రమాదంలో నార్పల మండలం గూగూడు గ్రామానికి చెందిన జగన్మోహన్‌రెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు. అతను తన భార్య శివజ్యోతితో కలిసి.. గురువారం ద్విచక్రవాహనంలో రామగిరి మండలం పోలేపల్లి గ్రామం నుంచి స్వగ్రామానికి బయలుదేరాడు. ధర్మవరంలోని సబ్‌జైలు వద్దకు రాగానే కళాజ్యోతి వైపు నుంచి మరో ద్విచక్రవాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో జగన్మోహన్‌రెడ్డికి తీవ్రంగా, శివజ్యోతికి స్వల్పంగా గాయాలయ్యాయి. స్థానికులు జగన్మోహన్‌రెడ్డిని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆస్పత్రికి తరలించారు. వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు


బహుమతులు అందజేసిన సత్యసాయి ట్రస్టుసభ్యులు

కొత్తచెరువు, జనవరి 23(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సత్యసాయిట్రస్టు ఆధ్వర్యంలో సత్యసాయి సేవాసమితి సభ్యులు గురువారం ఇంటర్ విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఇందులో మానవతా విలువలు పెంపొందించడం ఎలా అన్న అంశంపై పోటీలు నిర్వహించారు. ఇందులో ప్రతిభ కనబరచిన 60 మంది విద్యార్థులకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సేవా సమితి కన్వీనర్ కొండమీద రాయుడు, బాలవికాస్, ఈశ్వరప్ప, ఆదినారాయణ , వెంకటరత్నం, భజన మండలిసభ్యులు పాల్గొన్నారు.

అధికారులు నిర్లక్ష్యం వీడాలి

కొత్తచెరువు, జనవరి 23(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి నిర్వహిస్తున్న గ్రామసభకు కొన్ని శాఖల అధికారులు గైర్హాజర్ కావడంపై ఎంపీడీఓ నటరాజ్ మండిపడ్డారు. అధికారులు నిర్లక్ష్యం వీడి.. ఇకపై నిర్వహించే గ్రామసభలకు తప్పక హాజరుకావాలని, లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ రాధా అధ్యక్షతన గ్రామసభను ఈఓ శ్రీనివాసరెడ్డి గురువారం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ... ప్రభుత్వం గ్రామ పంచాయతీల్లో నెలకొన్న సమస్యలను సచివాలయ సిబ్బంది, ప్రజాప్రతినిధులు తమ దృష్టికి తెస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ప్రజలు కూడా ఈ గ్రామ సభలను సద్వినియోగం చేసుకో వాలన్నారు. కాగా, ఈ సభకు వార్డు మెంబర్లు కూడా గైర్హాజర్ అయ్యారు.

కేసులు ఎత్తివేయాలి

పుట్టపర్తిరూరల్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులపై నమోదు చేసిన కేసులను ఎత్తివేయాలని యూటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం ఈ మేరకు జిల్లా అధ్యక్ష, రాష్ట్ర కార్యదర్శులు శెట్టిపి జయచంద్రారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్ జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ వి.రత్నకు వినతి పత్రం అందచేశారు. తమ డిమాండ్ల సాధనలో భాగంగా 2022లో సీపీఎస్ రద్దు కోరుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు ఆందోళన చేసినప్పుడు పలు కేసులు నమోదు చేశారని, వాటిని ఎత్తివేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శులు లక్ష్మీనారాయణ, నారాయణ స్వామి, యూటీఎఫ్ నాయకులు రవీంద్రనాథ్, రామాంజినేయులు పాల్గొన్నారు.

క్రైం న్యూస్ ..

వాచ్‌మన్ ఇంట్లో చోరీ

ముదిగుబ్బ, జనవరి 23(ఆంధ్రజ్యోతి): స్థానిక బాలాజీ నగర్ సమీపంలో నివాసముంటున్న శ్రీనివాసులు ఇంట్లో బుధవారం రాత్రి చోరీ జరిగింది. ఇతను ప్రభుత్వ పాఠశాలలో వాచ్‌మన్‌గా విధులు నిర్వహిస్తున్నారు. బుధవారం రాత్రి పాఠశాల వద్ద విదుల్లో ఉండగా.. అతని ఇంట్లో ఎవరూ లేని విషయాన్ని గమనించిన దుండగులు చోరీకి పాల్పడ్డారు. అతని ఇంట్లోని మూడు తులాల బంగారు నగలను, రూ. 80 వేలను ఎత్తుకెళ్లారు. గురువారం ఉదయం ఈ విషయాన్ని గుర్తించిన శ్రీనివాసులు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తమ కుమార్తె అనంతరపురంలో ఓ ప్రైవేటు కళాశాలలో చదువుకుంటోందని, ఫీజు కట్టడానికి దాచుకున్న డబ్బు ఎత్తుకెళ్లారని వాపోయాడు.

మామిడి మొక్కల విరిచివేత



ఓబుళదేవరచెరువు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గౌనిపల్లిలో గౌడ్ చంద్రశేఖర్, గౌడ్ నాగరాజుకు చెందిన 60 మామిడి మొక్కలను గుర్తు తెలియని వ్యక్తులు గురువారం విరిచేసినట్లు బాధితులు వాపోయారు. గౌనిపల్లి సర్వేనెంబర్ 1182, 1183లో 2.14 ఎకరాల విస్తీర్ణంలో ఎనిమిది నెలల క్రితం 175 మామిడి మొక్కలను నాట్టామన్నారు. ప్రతిరోజు లాగే తాము బుధవారం సాయంత్రం వరకు తోట వద్ద ఉండి ఇంటికెళ్లామన్నారు. అయితే గురువారం ఉదయం తొటవద్దకు వెళ్లి చూడా గుర్తుతెలియని వ్యక్తులు దాదాపు 60 మొక్కలు విరిచేసినట్లు తెలిపారు. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. ప్రభుత్వమే తమను ఆదుకోవాలని కోరారు.

కుక్కల దాడి - పది గొర్రెపిల్లలు మృతి


మృతిచెందిన గొర్రె పిల్లలు

నంబులపూలకుంట, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బీమ బోయన పల్లిలో లక్ష్మీనారాయణ చెందిన పది గొర్రె పిల్లలపై గురువారం కుక్కల దాడి చేయడంతో అవి మరణించాయి. వ్యవసాయంలో నష్టాలు రావడంతో లక్ష్మీనారాయణ రూ. ఐదు లక్షలు అప్పులు చేసి 70 గొర్రెలు కొనుగోలు చేశాడు. భార్యాభర్తలు ఇరువురు గొర్రెలను మేతకే తోలుకెళ్లగా, పది పిల్లలను ఇంటి వద్దనే దొల్లకింద మూసివేసి భద్ర పరచివెళ్లారు. పగటిపూట కుక్కలు చొరబడి ఉన్న పది గొర్రెపిల్లలను చంపి వేశాయి. సాయంత్రం ఇంటికి వచ్చి చూస్తే పది పిల్లలు విగత జీవులుగా పడి ఉండటాన్ని చూసి.. ఆ దంపతులు విలపించారు. రూ.లక్ష నష్టం జరిగిందని, ప్రభుత్వమే ఆదుకోవాలని కోరారు.

చేనేత పరిశ్రమను ఆదుకోండి

ధర్మవరం, జనవరి 23(ఆంధ్రజ్యోతి): చేనేత పరిశ్రమకు బడ్జెట్‌లో రూ.2వేల కోట్లు కేటాయించి ఆదుకోవాలని చేనేత కార్మిక సంఘం జిల్లా నాయకులు ఎస్‌హెచ్‌బాషా, హరికుమార్, వెంకటస్వామి, రామాంజినేయులు కోరారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో గురువారం వారు మాట్లాడారు. చేనేతపై జీఎస్టీ పూర్తిగా రద్దు చేయాలని, రీఎంబర్స్‌మెంట్ అమలు చేయాలని, 200 యూనిట్ల ఉచిత కరెంటుకు వెంటనే జీఓ విడుదల చేయాలని, పావలా వడ్డీ రిబేటు బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు.

న్యూస్ బాక్స్

కృష్ణా బోర్డు కర్నూలులో ఏర్పాటు చేయాలి



వినతిపత్రం అందిస్తున్న జలసాధన సమితి సభ్యులు

పెనుకొండ, జనవరి 23(ఆంధ్రజ్యోతి): కృష్ణారివర్ మేనేజ్‌మెంట్ బోర్డు కర్నూలులో ఏర్పాటు చేయాలని కోరుతూ జలసాధనసమితి సభ్యులు.. మంత్రి సవితకు గురువారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన చట్టం 2014 సెక్షన్ 85ప్రకారం కృష్ణానది యాజమాన్యబోర్డు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఏర్పాటు చేయాల్సిఉందన్నారు. ఇప్పటివరకు బోర్డు హైదరాబాద్‌లోనే ఉందన్నారు. జనవరి 21న జరిగిన కృష్ణాబోర్డు సమావేశంలో బోర్డును విజయవాడకు తరలించడానికి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు అంగీకరించాయన్నారు. ఇది జరిగితే కృష్ణా జలాల్లో రాయలసీమకు అన్యాయం జరిగే అవకాశం ఉందన్నారు. కావున ఈ ప్రతిపాదనను ప్రభుత్వం విరమించుకుని కర్నూలులో బోర్డును ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జలసాధన సమితి అధ్యక్షుడు వెంకటరామిరెడ్డి, ఓపీడీఆర్ రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, జిల్లా ప్రచారకార్యదర్శి జమీల్, సీపీఐ డివిజన్ కార్యదర్శి శ్రీరాములు తదితరులు ఉన్నారు.

టీడీపీ కార్యకర్తకు ఆర్థిక సాయం



కార్యకర్తను పరామర్శిస్తున్నటీడీపీ నేత వెంకటేశ్వర్‌రావు

పెనుకొండ టౌన్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన టీడీపీ కార్యకర్త వెంకటేశులుకు టీడీపీ నాయకుడు వెంకటేశ్వర్‌రావు రూ.10వేలు ఆర్థిక సాయం అందజేశారు. బెంగళూరు ఆసుపత్రిలో చికిత్సపొంది ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న విషయం తెలుసుకుని గురువారం స్థానిక మారుతి నగర్‌లో అతని ఇంట్లో పరామర్శించారు. కార్యక్రమంలో శ్రీరాములు, రమణమ్మ, లక్ష్మీదేవమ్మ, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చట్టం నుంచి ఎవరూ తప్పించుకోలేరు



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి శ్రీధర్

హిందూపురం, జనవరి 23(ఆంధ్రజ్యోతి) తప్పుచేసిన వారు చట్టం నుంచి ఎవరూ తప్పించుకోలేరని హిందూపురం సీనియర్ సివిల్ కోర్టు న్యాయాధికారి శ్రీధర్ పేర్కొన్నారు. గురువారం స్థానిక స్థానిక సబ్‌జైల్‌ను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించి, నిందితులు ఏఏ నేరాలు చేసిన జైలుకు వచ్చారనే విషయాలపై ఆరాతీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. చట్టం దృష్టిలో అందరూ సమానులేనని, తప్పుచేసిన వారు ఎంతటివారైనా తప్పించుకోలేరన్నారు. ఖైదీలకు న్యాయవాదులను నియమించుకునేందుకు ఆర్థిక స్థోమతలేకపోతే ప్రభుత్వమే ఉచితంగా న్యాయవాదిని నియమిస్తుందని అలాంటి వారు ముందుగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. జైలు నుండి బయటికి వెళ్లిన తరువాత సత్‌ప్రవర్తనతో మెలిగి ప్రశాంత జీవనం సాగించాలన్నారు. ఖైదీలకు అందుతున్న ఆహార నాణ్యత, ఆరోగ్య సంరక్షణ తదితర విషయాలపై సబ్ జైలర్ హనుమన్నను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు కృష్ణమూర్తి, నరసింహమూర్తి, రవికుమార్, హష్నా తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ, లేబర్ ఆఫీసర్

పెనుకొండ రూరల్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): మట్టి పనివారు, గుంతలు తీసేవారు, భవన నిర్మాణ మేస్త్రీలు, తదితర కూలీలకు కూటమి ప్రభుత్వం కార్మిక బోర్డు ఏర్పాటు చేసిందని గుర్తింపు కార్డులు పొందితే కార్మికులకు పలు సంక్షేమ పథకాలు అందుతాయని ఎంపీడీఓ నరేష్‌కృష్ణ, లేబర్ ఆఫీసర్ సత్యనారాయణ పేర్కొన్నారు. ఈ సందర్భంగా గురువారం ఓ ప్రకటనలో మాట్లాడుతూ కార్మికుల సంక్షేమ బోర్డు సభ్యత్వ నమోదు తీసుకున్నవారికి కార్మికుని కుమార్తె వివాహ కానుక కింద రూ.20వేలు, మహిళా కార్మికులు రెండు కాన్పుల వరకు రూ.20వేలు, సాధారణ మరణంకు రూ.80వేలు, మరణించిన కార్మికుని దహనసంస్కారం కోసం రూ.20వేలు, పనిప్రదేశంలో కార్మికుడు ప్రమాదవశాత్తు అంగవైకల్యం పొందితే శాతంబట్టి రూ.5లక్షల దాకా పరిహారం, పని ప్రదేశంలో ప్రమాదవశాత్తు మృతిచెందితే రూ.50వేలు భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు వెసలుబాటు కల్పించిందన్నారు. 18ఏళ్ల నుంచి 60ఏళ్ల వయసులో ఉన్న ఈపీఎఫ్, ఈఎస్ఐ లేనటువంటి ప్రజలందరూ అర్హులేనని తెలిపారు. అదేవిధంగా ఉపాధిహామీ కూలీలు పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఐదేళ్లకుగాను రూ.180 రుసుము చెల్లించి భవన కార్మిక గుర్తింపు కార్డు పొందితే పథకాలు అందుతాయన్నారు.

నేడు వాల్మీకి దేవాలయ ప్రథమ వార్షికోత్సవం

హిందూపురం అర్బన్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని సూరప్పకట్ట వద్ద ఉన్న శ్రీ వాల్మీకి రామ దేవాలయం శుక్రవారం ప్రథమ వార్షికోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకుడు వైఎస్ భాస్కర్ తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం 7 గంటలకు పంచామృతాభిషేకం, 9 గంటలకు నవగ్రహ, మృత్యుంజయ, నక్షత్ర, ఆయుష్‌పవమాన హోమాలు అనంతరం శ్రీరామరక్ష స్తోత్ర హోమం, బలి, పూర్ణాహుతి, మధ్యాహ్నం 12.30 గంటలకు కుంభాభిషేకం, ఒంటి గంటకు తీర్థప్రసాద వినియోగం ఉంటుందన్నారు. పెద్ద సంఖ్యలు భక్తులు హాజరై దైవకృపకు పాత్రులు కావాలని కోరారు.

తెగిన గట్లు

నిలవని నీరు

- ● కోతకు గురైన కాలువలకు మరమ్మతులు కరువు
- ● తాగు, సాగు నీటికి తప్పని ఇబ్బందులు

మడకశిర, జనవరి 23(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో కురిసిన వర్షపు నీరంతా తెగిన కాలువలు, చెక్‌డ్యాంలు గుండా వృథాగా పోతోంది. దీంతో ప్రజలు తాగు, సాగు నీటికి తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. మడకశిర నియోజక వర్గంలో ఎటువంటి సాగు నీటి వనరులు లేక పోవడంతో ఈ ప్రాంతం రైతులు మెట్ట భూములలో పంటలు సాగు చేస్తూ



పూడిక, కంపచెట్లతో నిండిన చెక్ డ్యాం

జీవనం సాగిస్తున్నారు. ఆ పంటలు కూడా వర్షాభావంతో దెబ్బతినడంతో అప్పుచేసి కొంత మంది రైతులు బోర్లు తవ్వించుకున్నారు. అధిక వడ్డీకి అప్పులు తెచ్చి బోర్లు తవ్వించినా నీరు దొరకడం మాత్రం కష్టసాధ్యంగా మారింది. అలాకాకుండా తెగిన కుంటలు, చెక్‌డ్యాంలకు మరమ్మతులు చేపడితే అందులో నీరు నిలబడి భూగర్భజలాలు పెరిగే వీలుంటుంది.

అమరాపురం మండలంలో నాచేపల్లి సప్లైచానల్ నుంచి కర్ణాటకకు వెళ్ళే నీటిని, గుడిబండ మండలంలో మోరుబాగల్ సప్లైచానల్ నుంచి కర్ణాటకకు వెళ్లే నీటిని మన ప్రాంతంలోని చెరువులకు మళ్లించేందుకు రూ.2కోట్ల నిధులు మంజూరయ్యాయి. వైసీపీ హయాంలో రెండు మార్లు టెండర్లయినా పనులు జరగకపోవడంతో ఆ నిధులు వెనక్కు మళ్లాయి.



కోతకు గురైన గంగళవాయి పాళ్యం కాలువ

దీంతో నాచేపల్లి సప్లైచానల్ నుంచి కర్నాటకలోని దొడ్డబాణగెర చెరువుకు నీరు వెళ్తోంది. ఆ నీటిని మళ్లిస్తే తమ్మడేపల్లి చెరువుకు నీరు చేరుతుంది. మోరుబాగల్ సప్లైచానల్ నీరు కూడా మళ్లించకపోవడంతో దిగువ ప్రాంతంలోని కర్ణాటక చెరువులకు నీరు చేరుతోంది. రొళ్ళ మండలం హొట్టేబెట్ట నుంచి గంగలవాయిపాళ్యం, గోవిందాపురం మీదుగా వచ్చే నీటిని మడకశిర చెరువుకు మళ్లించేందుకు పది సంవత్సరాల క్రితం ఎస్టిమేట్‌వేసి ప్రతిపాదనలు పంపారు. నిధులు మంజూరు కాకపోవడంతో ఆ ప్రాజెక్ట్ ప్రతిపాదనలకే పరిమితమైంది. వర్షాలు కురవక చెరువులో నీరు లేకపోతే పట్టణానికి తాగునీటి సమస్య ఏర్పడుతుంది.

అగళి మండలంలో స్వర్ణముఖి నది కట్టలు కూడా కోతకు గురై కొద్దిపాటి వర్షం వచ్చినా నీరు వృథాగా పోతోంది. అలాగే రొళ్ల మండలం కొడగార్లగుట్ట కాలువలో పూడిక పేరుకుపోయి కంపచెట్లు పెరగడంతో నీరంతా వృథా అవుతోంది. పూడికను తొలగించి కంపచెట్లు తొలగిస్తే వర్షపు నీరు రొళ్ల చెరువుకు చేరుతుంది.

నిధులు వస్తే పనులు చేపడతాం: శ్రీనివాసులు, ఇరిగేషన్ ఏఈ

కాలువల నుంచి చెరువులకు నీరు అందించేందుకు గతంలో ప్రతిపాదనలు పంపాము. కొన్నింటికి నిధులు మంజూరు కాలేదు. మళ్లీ కొత్తగా అంచనాలు వేసి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతాము. నిధులు మూజూరు అయిన వెంటనే పనులు చేపడతాం.

సప్లయ్ చానల్‌లో పూడిక తొలగిస్తే చెరువుకు నీరు



వర్షాలు కురిసినా రొళ్ల చెరువుకు నీరు రావడం లేదు. దీంతో తాగు, సాగునీటికి ఇబ్బందులు పడాల్సి వస్తోంది. కోడగార్లగుట్ట సప్లయిచానల్‌లో పూడిక, కంపచెట్లు తొలిగిస్తే రొళ్ల చెరువుకు పుష్కలంగా నీరు చేరుతుంది. అధికారులు కాలువలో పూడికను, కంపచెట్లను తొలగించేలా చర్యలు చేపట్టాలి.

సీబన్న, రైతు, రొళ్ళ

ఘనంగా మంత్రి లోకేశ్ జన్మదిన వేడుకలు

హిందూపురం, జనవరి 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్యాశాఖ, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ జన్మదిన వేడుకలను గురువారం హిందూపురం, పెనుకొండలలో ఘనంగా నిర్వహించారు. హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి కార్యాలయంలో ఆయనతోపాటు టీడీపీ నాయకులు భారీ కేక్‌కట్‌చేసి ఒకరినొకరు తినిపించుకున్నారు. అనంతరం బీటీఆర్ కాలనీలోని ఆదర్శ పాఠశాలలో విద్యార్థులతో కలిసి బీకే కేక్ కట్‌చేసి పిల్లలకు తినిపించారు. 180మంది పిల్లలకు నోటుపుస్తకాలు, పెన్సిళ్లు, అందజేశారు. మంత్రి నారా లోకేశ్ జన్మదిన వేడుకలను హిందూపురంలో ఘనంగా జరుపుకున్నారు. ఎమ్మెల్యే బాలకృష్ణ నివాసం వద్ద టీడీపీ నాయకులు, నందమూరి అభిమానులు భారీ కేక్ కట్‌చేసి మిఠాయిలు పంచారు. చిలమత్తూరు సమీపంలోని కొడికొండ చెక్‌పోస్టు



విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేసిన ఎంపీ బీకే పార్థసారథి



సోమందేపల్లిలో కేక్‌కట్‌చేస్తున్న వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్

సమీపంలోని సమర్థనం ట్రస్టులో టీడీపీ నాయకులు చిన్నారుల మధ్య వేడుక జరుపుకున్నారు. పరిగి మండలంలోని మొద ఉన్నత పాఠశాలలో గురువారం మండల కన్వీనర్ గోవిందరెడ్డి ఆధ్వర్యంలో లోకేష్ పుట్టిన రోజు వేడుకలు జరుపుకున్నారు. సోమందేపల్లి మండలంలోని జెడ్పీహెచ్ఎస్, పాపిరెడ్డిపల్లిలోని కేజీబీవీలో కేక్‌కట్‌చేసిన టీడీపీ నాయకులు విద్యార్థులకు నోటుపుస్తకాలు అందజేశారు. గోరంట్ల మండలంలోని బూదిలి పాఠశాలలో లోకేష్ జన్మదిన వేడుకలను టీడీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో బాలికలచే కేక్ కట్‌చేయించారు. అనంతరం రెండువందల మంది విద్యార్థులకు నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. పెనుకొండ మండలం చంద్రగిరి ప్రభుత్వ పాఠశాలకు బుధవారం రైతు సంఘం ఉపాధ్యక్షులు పోతిరెడ్డి ఆధ్వర్యంలో డీలర్ నాగరాజు వంటపాత్రలు వితరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యాశాఖకు మంత్రి నారా లోకేశ్ పెద్ద పీట వేస్తున్నారని పేర్కొన్నారు.



చంద్రగిరి ప్రభుత్వ పాఠశాలకు వంటపాత్రలు అందజేస్తున్న దృశ్యం

పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించాలి

- ● ఎమ్మెల్యే ఎంఎస్ రాజు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

మడకశిరటౌన్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతూ ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే ప్రతి పేదవాడికి మెరుగైన వైద్యసేవలు అందించి పేదల మన్ననలు పొందాలని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు అన్నారు. గురువారం ఆర్‌అండ్‌బీ అతిథిగృహం ఆవరణంలో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామితో కలిసి వైద్యులకు పలు సూచనలు చేశారు. పేదల ప్రభుత్వం అని ఆస్పత్రికి వచ్చే ప్రతి సామాన్యుడికి నాణ్యమైన వైద్యం అందించాలన్నారు. ఏ చిన్న కేసు కూడా రెఫర్ చేయవద్దని స్థానికంగానే వైద్యం అందేలా చూడాలని పలు సూచనలు చేశారు. ఆస్పత్రి సంబంధించిన సమస్యలను అడిగి తెలుసుకొన్నారు. ప్రతి సమస్య పరిష్కరించేందుకు తాము ముందుంటామని, మెరుగైన వైద్య సేవలు అందించి ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలని కోరారు.ఈ సందర్భంగా టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసమూర్తి, డాక్టర్లు దివాకర్, శశిరేఖ, సుధాకర్, డాక్టర్ సెల్ అధ్యక్షులు కొంకల్లు కృష్ణమూర్తి, కమిటీ సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

పట్టణంలోని వెంకటేశ్వరస్వామి ఆలయ సమీపంలోని పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే మద్దనకుంట ఈరన్న ఆధ్వర్యంలో గురువారం నారాలోకేష్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. నాయకుల మధ్య కేక్‌కట్‌చేసి నారాలోకేష్‌కు జన్మదిన శుభాకాంక్షలను తెలిపారు. అగళి మండలకేంద్రంలో గురువారం రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారాలోకేష్ జన్మదిన వేడుకలను జెడ్పీటీసీ ఉమేష్ ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. ఎన్టీఆర్ విగ్రహం వద్ద తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు,అభిమానులు కేక్‌కట్‌చేసి స్వీట్లు పంచుకున్నారు.



కేక్ కట్ చేస్తున్న జడ్పీటీసీ ఉమేష్

అన్నం పెట్టే రైతుకు అండగా చంద్రబాబు

- ● బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత

పెనుకొండ టౌన్, జనవరి 23(ఆంధ్రజ్యోతి) : రైతుల గుండెపై చేయివేసుకుని పడుకునే రోజులు వచ్చాయని, పిడికెడు అన్నం పెట్టే రైతులకు అండగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉన్నారన్నారు. బీసీ సంక్షేమ చేనేత జౌళిశాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. గురువారం పెనుకొండ విద్యుత్‌శాఖ కార్యాలయంలో రైతులకు వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లు పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి సవిత మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడటంతో



ద్విచక్రవాహనదారుడికి హెల్మెట్ ధరింపజేస్తున్న మంత్రి సవిత

రైతులకు కరెంటు కష్టాలు తీరాయన్నారు. పెనుకొండ నియోజకవర్గ వ్యాప్తంగా 92ట్రాన్స్‌ఫార్మర్‌లు మంజూరయ్యాయని వాటన్నింటికి పార్టీలకు అతీతంగా అందిస్తున్నట్లు తెలిపారు. గత వైసీపీ పాలనలో నాయకుల ఒత్తిడితో కేవలం వైసీపీ సానుభూతిపరులకే ట్రాన్స్‌ఫార్మర్‌లు అప్పగించామన్నారు. ఇంకా 184ట్రాన్స్‌ఫార్మర్‌లు త్వరలో అందించనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం రెండు సబ్‌స్టేషన్ పనులు జరుగుతున్నాయని, మూడు సబ్‌స్టేషన్లను ప్రారంభించనున్నట్లు తెలిపారు. రైతు భరోసా కింద రూ.20వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు. గతంలో విద్యుత్ రెండు దఫాలుగా ఇచ్చేవారని ఎన్డీఏ కూటమిలో ఇచ్చిన మాట ప్రకారం తొమ్మిది గంటల నాణ్యమైన విద్యుత్‌ను అందిస్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌కో అధికారులు, నాయకులు షౌకత్, దాదు, మావటూరు గోపాల్, రామలింగ, త్రివేంద్ర, బాబుల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా వారోత్సవాల్లో మంత్రి సవిత

రోడ్డు భద్రతా వారోత్సవాల సందర్భంగా బీసీ సంక్షేమ చేనేత జౌళిశాఖ మంత్రి సవిత పాల్గొన్నారు. పోలీసుల ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులు, పోలీసులు, ఎన్డీఏ కూటమి నాయకులు కలిసి పెద్దఎత్తున ర్యాలీ నిర్వహించారు. ప్రధాన కూడళ్లలో దర్గాసర్కిల్, అంబేద్కర్ తదితర సర్కిళ్లలో ర్యాలీ నిర్వహించారు. హెల్మెట్‌లు తప్పనిసరిగా వాడాలన్నారు.

సిబ్బంది కొరతతో వైద్య సేవలకు ఇబ్బంది

లేపాక్షి, జనవరి 23(ఆంధ్రజ్యోతి) :స్థానిక సర్వజన ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సేవల కోసం ప్రజలు గంటల తరబడి నిరీక్షిస్తున్నారు. మండలానికి మొత్తం ఒకే ఆసుపత్రి ఉండటంతో చుట్టుపక్కల గ్రామాల నుంచి రోగులు వైద్య సేవల కోసం అధిక సంఖ్యలో విచ్చేస్తుంటారు. ప్రతి రోజూ దాదాపు 180మంది వివిధ రకాల రోగాలతో చికిత్సకోసం ఆసుపత్రికి విచ్చేస్తున్నారు. అయితే ప్రభుత్వ ఆసుపత్రిలో ఇద్దరు వైద్యులు ఉండగా 104వాహనంలో ఒకరు వెళ్తారు. మరో వైద్యుడు ఇటు వైద్యసేవలు చూస్తూ అత్యవసర సమావేశాలకు హాజరు కావాల్సి ఉండడంతో వైద్యసేవలకు అంతరాయం ఏర్పడుతోందని రోగులు అంటున్నారు. గంటల తరబడి ఆసుపత్రిలో వేచి ఉండాలంటే ఇబ్బందులకు గురవుతున్నట్లు తెలిపారు.

ఘనంగా సుభాష్‌చంద్రబోస్ జయంతి వేడుకలు



సమావేశంలో మాట్లాడుతున్న హెచ్ ఎం భూతన్న

మడకశిర రూరల్, జనవరి 23(ఆంధ్రజ్యోతి): నేతాజీ సుభాష్ చంద్రబోస్ 128వ జయంతి వేడుకలు అన్నీ పాఠశాలల్లో గురువారం ఘనంగా జరుపుకొన్నారు. నేతాజీ చిత్రపటానికి పూలమాలు వేసి ఘనంగా నివాళులర్పించారు. జిల్లేడగుంట ప్రధానోపాధ్యాయులు భూతన్న మాట్లాడుతూ స్వాతంత్ర సమర పోరాట యోధుడు నేతాజీ అందరికీ స్ఫూర్తి అన్నారు.

పావగడ: దేశంకోసం ఎన్నో పోరాటాలు చేసి ప్రాణత్యాగం చేసిన సుభాష్ చంద్రబోస్ జయంతిని పట్టణంలోని వెంకటేశ్వర ఇంగ్లీష్ మీడియా పాఠశాలలో గురువారం ఘనంగా జరుపుకున్నారు. పాఠశాల కోశాధికారి పరందామరెడ్డి, సిబ్బంది సుభాష్‌చంద్రబోస్ చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది శ్రీనివాస్, శ్రీవాణి, ఐశ, పుష్ప పాల్గొన్నారు.

పెనుకొండ:ఆజాద్‌హింద్ ఫౌజ్ నిర్మాత సుభాష్‌చంద్రబోస్ జయంతి వేడుకలను మాజీ సర్పంచ్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని మిట్టఆంజనేయస్వామి ఆలయం పక్కనగల సుభాష్ విగ్రహంవద్ద జరిగిన వేడుకలకు బీసీ సంక్షేమ చేనేతజౌళిశాఖ మంత్రి సవిత హాజరై పూలమాలలువేసి నివాళులు అర్పించారు. దేశ స్వాతంత్య్రం కోసం సుభాష్‌చంద్రబోస్ చేసిన సేవలను, త్యాగాలను ఆమె కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్, ఆలయ కమిటీ అధ్యక్షుడు శ్రీనివాసులు, టీడీపీ నాయకులు కేశవయ్య, లక్ష్మీనారాయణరెడ్డి, త్రివేంద్రనాయుడు, కన్వీనర్ శ్రీరాములు, బాబుల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దాడిపై ఎస్పీ విచారణ



నార్సింపల్లిలో దాడి సంఘటనపై విచారిస్తున్న ఎస్పీ రత్న

గోరంట్ల, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నార్సింపల్లిలో ప్రేమ వ్యవహారానికి సంబంధించి దళిత యువకుడు డ్రైవర్ ఆంజనేయులుపై జరిగిన దాడి పట్ల ఎస్పీ రత్న గురువారం క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. మూడురోజుల క్రితం బాలికలను ఆంజనేయులు వెంట తీసుకెళ్లడంతో అమ్మాయి బంధువులు వారి ఆచూకి తెలుసుకుని గ్రామానికి తీసుకొచ్చిన విషయం తెలిసిందే. అమ్మాయిని తీసుకెళ్లారన్న కోపంతో బంధువులు, గ్రామస్తులు కలిసి బుధవారం అబ్బాయిపై దాడిచేశారు. అబ్బాయిని స్థంభానికి కట్టేసి కొట్టడంతోపాటు, పేడనీళ్లు, ముఖంపై చల్లి, చెప్పులతో దాడి చేశారన్న బాధితుడు ఫిర్యాదుమేరకు ఆరుగురిపై గోరంట్ల పోలీస్ స్టేషన్‌లో ఎస్సీఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. అలాగే అమ్మాయి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అబ్బాయిపై ఫోక్సోకేసు నమోదైంది. ఎస్పీ నార్సింపల్లి గ్రామానికెళ్లి ఇరుకుటుంబాల వారితో దాడి పరిస్థితులను విచారించారు. అలాగే పోలీస్ అధికారులతో జరిగిన సంఘటనపై చర్చించారు. దాడి గురించి దళిత సంఘాల నాయకులు ఎస్పీకి వివరించారు. ఒక ప్రేమ వ్యవహర ంలో జరిగిన ఘటనపై చట్టప్రకారంవ్యవహరిస్తామని ఎస్పీ తెలిపారు. ఈదాడి ని సీరియస్‌గా పరిగణిస్తూ గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ముందుజాగ్రత్త చర్యల కోసం పోలీసులను ఆదేశించారు. రెండు కుటుంబాల వారికి రక్షణ కల్పిస్తూ, ఎలాంటి సంఘటన చోటు చేసుకోకుండా భద్రత చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో పెనుకొండ డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ ఉన్నారు.

వీఆర్‌ఓలు అందుబాటులో ఉండేలా చూడండి

- ● సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధులు



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ సౌజన్యలక్ష్మి

లేపాక్షి, జనవరి 23(ఆంధ్రజ్యోతి): వీఆర్‌ఓలు ప్రజలకు అందుబాటులో ఉండటంలేదని ప్రజాప్రతినిధులు గురువారం జరిగిన సర్వసభ్య సమావేశంలో తహసీల్దార్ సౌజన్యలక్ష్మీకి ఫిర్యాదు చేశారు. ప్రతి మూడు నెలలకోసారి నిర్వహించే సాధారణ మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ వెంకటలక్ష్మీ ఆధ్వర్యంలో గురువారం వెలుగు కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని ప్రజాప్రతినిధులు, అన్నిశాఖల అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ క్యాస్ట్ , ఇన్కం, సర్టిఫికెట్లకోసం సచివాలయాల్లోకి వెళ్తే వీఆర్‌ఓలు అందుబాటులో ఉండటంలేదన్నారు. రీసర్వేలు, పెనుకొండకు వెళ్లామని సాకులు చెప్పి ప్రజలను కార్యాలయం చుట్టూ తిప్పించుకుంటున్నారన్నారు. వెంటనే స్పందించిన తహసీల్దార్ సైజన్యలక్ష్మీ వీఆర్‌ఓలను అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. అన్నిశాఖల అధికారులు తమ శాఖల ద్వారా ప్రజలకు అందిస్తున్న ప్రభుత్వ పథకాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ నరసింహమూర్తి, అన్నిశాఖల అధికారులు పాల్గొన్నారు.

కార్యాలయం తనిఖీ

పావగడ, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): తుమల్ నూతన అధ్యక్షులు, పావగడ ఎమ్మెల్యే హెచ్‌వి వెంకటేశ్ గురువారం పావగడలోని సర్వే కార్యాలయాన్ని పరిశీలించారు. భూరక్ష పథకం కింద పాత పుస్తకాలు తొలగించి నూతన పుస్తకాలను అందివ్వడానికి కృషిచేస్తానని తెలిపారు. తుమల్ అధ్యక్షునిగా పావగడకు వచ్చిన ఎమ్మెల్యేను తహసీల్దార్ వరదరాజు సన్మానించారు.